
# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 296 శుక్రవారం 16 - 5 - 2025 పేజీలు : 8 వెల : రూ.3.00 www.epaperjournalistdiary.com


## యూఎస్‌కు జీరో టారిఫ్ ఆఫర్..



### డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,మే 15:అమెరికా భారత్‌ల మధ్య ట్రేడ్ డీల్‌పై చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలోనే యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ఉత్పత్తులపై టారిఫ్‌లను ఎత్తివేసేందుకు ఇండియా సిద్ధమైందని తెలిపారు. జీరో టారిఫ్ ప్రతిపాదనను భారత్ ముందుకు తీసుకొచ్చిందని చెప్పారు. దోహాలో జరిగిన ఓ సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌లో ఏదైనా అమ్మడం చాలా కష్టం. కానీ ఇండియా నుంచి మాకు ఓ ఆఫర్ వచ్చింది.



పారాదీప్ పోర్ట్‌లో

## నౌక కలకలం..

### భద్రత కట్టుదిట్టం చేసిన బలగాలు..

పారదీప్ : పాకిస్థాన్‌కు చెందిన 21 మంది నావికా సిబ్బంది ఉన్న ఒక నౌక ఒడిశాలోని పారాదీప్ పోర్ట్‌కు చేరుకుంది. దీంతో పోలీసులు అప్రమత్తమై పారదీప్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. దక్షిణ కొరియా నుంచి వయా సింగపూర్ మీదుగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు క్రూడ్ అయిల్‌ను తీసుకువచ్చిన 'ఎంటీ సైరన్ 2' వాణిజ్య నౌకలో మొత్తం 25 మంది నావికా సిబ్బంది ఉండగా, అందులో 21 మంది పాకిస్థానీయులు కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. క్రూడాయిల్‌ను అన్‌లోడ్ చేసే వరకు సిబ్బంది ఎవరూ నౌకను వదిలి వెళ్లరాదంటూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ గస్తీ తిరుగుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నది.





### వక్ఫ్ సవరణ చట్టంపై కేంద్రం హామీ..

# సుప్రీంకోర్టులో విచారణ వాయిదా

- ఏ వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని, ముస్లిమేతరులను బోర్డులో చేర్చమని సుప్రీంలో కేంద్రం హామీ
- వక్ఫ్ (సవరణ) చట్టం 2025 రాజ్యాంగబద్ధతపై పిటిషన్లపై విచారణ
- తదుపరి విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు
- చట్ట దుర్వినియోగం నివారణ, పారదర్శక నిర్వహణ కోసమే సవరణలని కేంద్రం వాదన
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల అక్రమణ నిరోధించడం కూడా లక్ష్యమని వెల్లడి

ఢిల్లీ,: వక్ఫ్ ఆస్తుల విషయంలో గానీ, వక్ఫ్ బోర్డు సభ్యుల నియామకంలో గానీ ఎలాంటి మార్పులు చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు మరోసారి హామీ ఇచ్చింది. వక్ఫ్ ఆస్తులను డీనోటి ఫై చేయడం లేదా వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చడం వంటి చర్యలు చేపట్టబోమని స్పష్టం చేసి ంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ రెండో అత్యున్నత న్యాయాధికారి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనానికి తెలిపారు.



ఘోర రోడ్డు

# ప్రమాదం

- స్లీపర్ బస్సులో చెలరేగిన మంటలు..
- ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు సజీవ దహనం..!

లక్నో ,: ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నో కిసాన్‌పాత్‌లో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బిహార్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న స్లీపర్ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దరాయప్తు చేస్తున్నారు. అయితే, ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. మంటలు రావడానికి కారణం ఏంటో ఆరా తీస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో 80 మంది ప్రయాణికులు బస్సులో ఉన్న సమాచారం. ఘటనలో ఐదుగురు సజీవ దహనం కాగా.. మృతుల్లో ఇద్దరు పిల్లలు, ఇద్దరు మహిళలు ఉన్నారు. వేకువ జామున 5గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.





- సరస్వతీ నది పుష్కర స్నానమాచరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలు
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు
- 10 అడుగుల సరస్వతీదేవి విగ్రహాన్ని, 86 గదుల వసతి సముదాయాన్ని ప్రారంభించిన సీఎం

### వైభవంగా ప్రారంభమైన

# సరస్వతీ పుష్కరాలు



**భూపాలపల్లి:** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యా యి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే త్రివేణి సంగమం వద్ద ఈ పుష్కర వేడుకలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుష్కరాల్లో పాల్గొన్నారు.



కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం..

### ప్రభుత్వాధికారులపై

# సుప్రీంకోర్టు సీరియస్

**ఢిల్లీ,మే15 :** హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా?అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది.

- అంతర్జాతీయ అణుశక్తి సంస్థను కోరిన రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్
- "ఆపరేషన్ సిందూర్" అనంతరం చేపట్టిన శ్రీనగర్ పర్యటన
- పహాల్గాం మృతులకు సంతాపం
- శ్రీనగర్ ఆర్మీ శిబిరంలోని జవాన్లతో మాటా మంతి




### పాక్ నుంచి అణ్వాయుధాలను

# స్వాధీనం చేసుకోవలసిందే

శ్రీనగర్ :బాధ్యాతారాహిత్యంగా ఉండే పాకిస్థాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలు భద్రంగా ఉన్నాయా..? అని కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రపంచాన్ని ప్రశ్నించారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పాక్ నుంచి అణ్వాయుధాలను తీసుకొని పర్యవేక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. నేటి ఉదయం జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో రాజ్ నాథ్ పర్యటించారు. ఆయనకు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత దళాలు నిర్వహించిన "ఆపరేషన్ సిందూర్" అనంతరం ఆయన చేపట్టిన తొలి పర్యటన ఇది. ఈ పర్యటనలో రక్షణ మంత్రి భారత సాయుధ దళాల సిద్ధతను సమీక్షించారు. పాక్ సరిహద్దుల్లో పడిన షెల్స్‌ను పరిశీలించారు. అనంతరం శ్రీనగర్ లోని ఆర్మీ 15 కార్ప్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి జవాన్లతో ముచ్చ టించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉగ్ర శిబిరాలు ఎక్కడ ఉన్నా నాశనం చేస్తామని చెప్పారు. టెర్రరిస్టులతో పోరాడి ప్రాణత్యాగాలు చేసిన జవాన్లకు శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

**హైదరాబాద్:**

తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలలో భారత రాష్ట్ర సమితి ఒకటి. ఇది రెండు పర్యాయాలు తెలంగా ణలో అధికారాన్ని చలాయించింది. ముఖ్య మంత్రిగా కేసీఆర్ రెండు పర్యాయాలు తెలం గాణ రాష్ట్రాన్ని పరిపాలించారు.. తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాదు.. భారత రాష్ట్ర సమితి కి అధ్యక్షుడిగా కేసీఆర్ కొనసాగారు. అధికారం పోయిన తర్వాత కూడా ఆయన అదే స్థానంలోనే ఉన్నారు. ఇక ఆయన కుమారుడు కేటీఆర్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. పేరుకు కార్యనిర్వాహక అధ్యక్షు డైనా సరే.. ఇప్పటికీ పార్టీలో పెత్తనం మొత్తం కేటీఆర్ దే. కొన్ని విషయాలు మినహా.. అన్నింటిలోనూ కేటీఆర్‌దే పెత్తనం సాగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలోభారత రాష్ట్ర సమితి పగ్గాలు కేటీఆర్ కు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు కూడా ఎస్ అనే సమాధానమే చెబుతున్నారు. అయితే కెసిఆర్ కేటీఆర్ ను ఎప్పుడు పార్టీ ప్రెసిడెంట్ చేస్తారు? అనే ప్రశ్నకు మాత్రం ఇంతవరకు సమాధానం లభించడం లేదు.కేటీఆర్ ఒకవేళ పార్టీ ప్రెసిడెంట్ అయితే.. హరీష్ రావు పరిస్థితి ఏమిటి అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది.



### తారకరాముడికే

# గులాబీ పగ్గాలు

# నార్సింగి పోలీస్ జర ఇదర్ దేఖో..!




## ఫోన్ చోరీకి గురైందని ప్రయాణికుడి ఫిర్యాదు


- క్యాబ్ డ్రైవర్ అడ్రస్ ఇచ్చినా పట్టించుకోని వైనం
- పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై బాధితుడి ఆగ్రహం

**జర్నలిస్ట్ డైరీ, నార్సింగి(మే 15):**


**"అయ్యా! నా ఫోన్ పోయింది.. తీసుకున్న వాడి అడ్రస్ ఇది.. దయచేసి నా ఫోన్ నా చేతికి అందేలా చేయండి" అంటూ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా.. నార్సింగి పోలీసులు తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్నిసార్లు వెళ్లినా పోలీసుల నుంచి ఎటువంటి సహాయసహకారాలు అందడం లేదని సదరు బాధితుడు వాపోతున్నాడు.**

**వివరాల్లోకి వెళితే..**

పుప్పాలగూడలోని శివ నగర్ కాలనీకి చెందిన రాజ్ కుమార్ మార్చి 29న సరూర్ నగర్ నుంచి మణికొండకు క్యాబ్ బుక్ చేసుకు న్నారు. రైడ్ నంబర్ RD 17432706447 017081 కాగా, జస్పుల పరమేశ్ అనే డ్రైవర్ వచ్చాడు. అయితే గమ్యస్థానం చేరగానే రాజ్ కుమార్ హడావుడిగా ఇంటి దగ్గర దిగిపోయాడు.


To the
Inspector of police
Narsingi Police Station.
Cyberabad.
Respected Sir,
Sub: Mobile lost in Cab.
I Rajkumar Bandari S/o Narsing Rao Age: 42 yrs, OCC: business, Residence of 1-58/8, Plot No-8, Shiva nagar Colony, pupalaguda Hyd-89,
I would like to bring to your kind notice that on 29th March, time: 11:20 pm, place Manikonda.
I booked a Cab from Saroornagar to Manikonda bearing Ride ID RD17432706447017081 Driver name: Jaspula Paramesh, mob no: 8688611148 on asking about my mobile the driver confirmed it was with him. As it was festival the next day he told that he was in village n he'll be back in 2 days. On requesting & calling repeatedly he demanded an amount of 2,500/- for returning my mobile. On Wed, I transfered the amt which he demanded & then on he started avoiding my calls & not responding.
So, I kindly request you to please look into this matter & do the needful help.
Thanking You
Your's faithfully.
Name - Rajkumar B
Mob details - Samsung Galaxy A23 5G
IMEI No: 353140/54/051751/6
IMEI: 354223/86/051951/1

తర్వాతి రోజు తన మొబైల్‌ను మర్చిపోయినట్టు గుర్తించి సదరు డ్రైవర్ పరమేశ్‌కు కాల్ చేశాడు. తన దగ్గరే ఉందని, రెండు రోజుల తర్వాత ఊరి నుంచి వస్తానని చెప్పుకొచ్చాడు. ఊరి నుంచి


Booking History
rapido
Customer Name
rajkumar bandari
Ride ID
RD17432706447017081
Driver name
Vardya Lalu
Vehicle Number
TG28T0056
Mode of Vehicle
Car
Time of Ride
Mar 30th 2025, 11:31 PM
Selected Price
₹ 708
11-14-5, Sri Sai Tarun Enclave, L. B. Nagar, Hyderabad, Telangana 500074, India
5-1-B/53, Road No. 4, Huda, Hyderabad, Puppalguda, Telangana 500089, India

రావడానికి తన దగ్గర డబ్బులు లేవని రూ.2500 కావాలని కోరగా, ఆ డబ్బులను రాజ్ కుమార్ ఇచ్చాడు. కానీ, పరమేశ్ హైదరాబాద్‌కు తిరిగిరాలేదు.. మొబైల్ తిరిగి ఇవ్వలేదు. ఎన్ని సార్లు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేదు. వస్తాను... తెస్తాను అన్నట్లుగానే సమాధానం ఇస్తున్నాడు.

ఈ నేపథ్యంలో నార్సింగి పోలీసులకు రాజ్ కుమార్ ఫిర్యాదు చేశాడు. తన మొబైల్ తీసుకన్న ఫలానా వ్యక్తి అడ్రస్ ఇదని, దయచేసి తన దగ్గర నుంచి మొబైల్‌ను తనకు ఇప్పించాలని కోరాడు. అయితే నార్సింగి పోలీసులు ఎంతమాత్రం పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాజ్ కుమార్ వాపోయారు. మొబైల్ ఎత్తుకెళ్లిన వ్యక్తికి సంబంధించిన అడ్రస్ ఇచ్చినా, ఎటువంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చిన్న కేసులో పోలీసులు ఇంత నిర్లక్ష్యంగా ఉంటే, పెద్ద పెద్ద కేసుల్లో ఇంకెలా ఉంటారని రాజ్ కుమార్ విమర్శిస్తున్నారు.

# సిఎస్కెలో "మాస్టర్ ప్లాన్"..!

## సుమారు 40 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

- సీఎస్కే అభివృద్ధిపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది
- ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టలేదు
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో, (మే 15): గత ప్రభుత్వం షాద్ నగర్ పట్టణంలోని సీఎస్కే గ్రీన్ విల్లాస్ ప్రాంతంలో పనుల ఎగవేతకు పాల్పడిందని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చర్యలు చేపట్టకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరించిందని దాని ఫలితంగా స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే"వీర్లపల్లి శంకర్" స్పష్టం చేశారు. గురువారం సీఎస్కే గ్రీన్ విల్లాస్ లో స్థానికులతో కలిసి దాదాపు 40 లక్షల రూపాయల విలువైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీలో రెండు చోట్ల శంకుస్థాపన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అదేవిధంగా కాలనీలో దిక్సూచి బోర్డులకు సంబంధించి పనులను కూడా ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. షాద్ నగర్ పట్టణంలోని అతిపెద్ద వార్డ్ పదవ వార్డెన్ గుర్తు చేశారు. ఇందులో సీఎస్కే అతి పెద్ద కాలనీ అని ఇందులో ఎంతో మంది ప్రముఖులు నివసిస్తున్నారని గుర్తు చేశారు. స్థానికులు అబ్దుల్ రబ్బాని చెప్పిన విధంగా ఈ కాలనీపై గత పాలకులు అధికారులు నిర్లక్ష్యం చేశారన్న విషయం తన దృష్టికి తెచ్చారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టలేదని ఒక మాస్టర్ ప్లాన్ అంటూ ఏమీ లేదని దీనివల్ల ఇక్కడ నివసిస్తున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి మాజీ కౌన్సిలర్ శ్రావణి తీసుకువచ్చారని పలు సందర్భాల్లో అభివృద్ధిపై తనతో వాదించడం జరిగిందని వాస్తవాలు తెలుసుకొని ఇక్కడ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మొదటి ఫేస్ లో దాదాపు రెండున్నర కోట్లకు పైగా పనులు ప్రగతిలో ఉన్నాయని రెండో ఫేస్ లో కూడా మరికొంత నిధులు సమకూర్చుతామని భరోసా ఇచ్చారు. కాలనీలో ఒక పద్ధతి లేకుండా డివైడర్లు ఏర్పాటు చేశారని వాటితో అనేక ఇబ్బందులు స్థానికులు ఎదుర్కొంటున్నారని వారి



అభ్యర్థన మేరకు త్వరలోనే వాటిని తొలగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. టిడిఎస్ నిధులు రెండు మున్సిపాలిటీలకు దాదాపు 25 కోట్ల వరకు సమకూర్చామని ఇంకా మరిన్ని నిధులు వస్తాయని నియోజకవర్గంలోని కొత్తూరు, షాద్ నగర్ మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కాలనీలో రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా అమృత్ టు లో మిషన్ భగీరథ పనులు కూడా చేపట్టబోతున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. కాలనీ అభివృద్ధికి పాటుపడుతున్న మాజీ కౌన్సిలర్ శ్రావణి, జమ్రుద్ ఖాన్ తదితరులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్,

మున్సిపల్ కమిషనర్ సునీత, 10వ వార్డు మాజీ కౌన్సిలర్ శ్రావణి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నేతలు జృమద్ ఖాన్,అగ్గనూర్ బస్వ చెంది తిరుపతి రెడ్డి రఘు నాయక్, ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, నాగమణి, రమాదేవి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రబ్బాని, ప్రధాన కార్యదర్శి సోమ శేఖర్, సాదత్, జామి శ్రీనివాస్ రెడ్డి శివరాం రెడ్డి, శివాన%శీ%ద్, డాక్టర్ చందూలాల్ రాథోడ్, బాలు, ఉస్మాన్, రంజిత్, బబ్బన్ సింగ్, ఉపేందర్ రాయ్, ఎంకే సింగ్, సుధాకర్ రెడ్డి, రజాక్, రవితేజ, మాధవులు, లింగారెడ్డిగూడెం అశోక్, చంద్ర శేఖర్, గంగమోని సత్తయ్య, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పరిగిలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సిఎస్





జర్నలిస్ట్ డైరీ,పరిగి మే (15):తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా పర్యటనలోభాగంగా పరిగి మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్పూర్ లో డీసీఎంఎస్ ద్వారా చేపడుతున్న వరికొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డి.ఎస్. చౌహన్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ల తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేపట్టాలనీ తెలిపారు వరి కొనుగోలు కేంద్రాల వద్ద తాడిపత్రిలు, గోనె సంచులు, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. వరి కొనుగోలు చేసిన రైతులకు సమయా నుకూలంగా రైతుల ఖాతాలోకి డబ్బులు జమ చేయాలని అధికారులకు సూచించారు. వరి ధాన్యానికి మద్దతు ధర తో పాటు, సన్న రకం వరి పండించిన రైతులకు ప్రభుత్వం అందించే 500 రూపాయల బోనస్ పై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు.



# రూ. 20 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో, (మే 15) : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 43 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20,47,000/- చెక్కులను ఎమ్మెల్యే ఆర్కెపూడి గాంధీ పంపిణీ చేశారు.ఈ సందర్భం గా గాంధీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు.

అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. ఈ సందర్భంగా తెలియచేశారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు.

గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని ,మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి , నాయి నేనీ చంద్రకాంత్ రావు, సాంబశివరావు, మంత్రిప్రగడ సత్యనారాయణ,పోతుల రాజేందర్, %వీణ% ఇబ్రహీం, కావూరి అనిల్, నాగేశ్వరరావు, మోజేశ్, ఇజ్రాయిల్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలకు హజ్ ఒక పవిత్రమైన తీర్థయాత్ర



జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో, (మే15) చందానగర్ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి నివాసంలో హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలను ప్రయాణం సురక్షితంగా సఫలంగా సాగాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. హజ్ యాత్ర వెళ్తున్న యాత్రికులకు ప్రయాణం సురక్షి తంగా సఫలంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియచేస్తున్నా ను అని, ఆ అల్లాహ్ దయతో అందరూ హజ్ యాత్ర సంపూర్ణం చేసుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. ఆ అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని కోరుకుంటున్నామని తెలియచేసారు.హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం ప్రభుత్వం ప్రతి ఏటా అన్ని సౌకర్యాలు, సదుపాయాలు కల్పించినట్టుగా ఈ ఏడాది కూడా అన్ని ఏర్పాట్లు చేసిందని తెలియచేసారు. సౌదీ అరేబియాలోని పవిత్ర నగరమైన మక్కాను సందర్శించడానికి ప్రపంచంలోని నలుమూలల నుండి వెళతారన్నారని అన్నారు. పవిత్ర నగరమైన మక్కాలోని అల్లాష్ (కాబా) పవిత్ర తీర్థయాత్ర ఇస్లామిక్ క్యాలెండర్ పన్నెండవ-చివరి నెలలో (జిల్-హజ్) జరుగుతుందన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ చంద్ర భావనపై ఆధారపడి ఉంటుందని, అందువల్ల, హజ్ తేదీలు ప్రతి సంవత్సరం భిన్నంగా ఉంటాయన్నారు. విభిన్న సామాజిక ప్రమాణాలు ఉన్నప్పటికీ లక్షలాది మంది ముస్లింలు ఒకే తెల్లటి వస్త్రాన్ని ధరిస్తే, అది యాత్రికులకు సమానత్వం-సంఘీభావాన్ని గుర్తు చేస్తుందని, అందరూ సమానులే అన్న భావనను కలిగిస్తుందన్నారు. కాగా మన రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ యాత్ర కు వెళ్లే యాత్రికులు అక్తర్, అక్బర్ ఖాన్, ఖలీదు,నమీమ్, షమీ మరియు నాయకులు రఘునాథ్ రెడ్డి, నరేందర్ బల్లా, అంజద్ పాషా,యూసఫ్ పాషా,అలీ భాయ్, ఖలీద్ పాషా, సాజిద్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



# కరాటేలో వికారాబాద్ యువతికి గోల్డ్ మెడల్

జర్నలిస్ట్ డైరీ వికారాబాద్, (మే 15): ఇటీవలె మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ 2025లో వికారాబాద్ జిల్లా నవపేట్ మండలం పులుమామిడి గ్రామానికి చెందిన స్పర్షిత గోల్డ్ మెడల్‌తో పాటు సిల్వర్ మెడల్ సాధించింది. గత మూడు సంవత్సరాల నుండి, చిట్టిగిద్ద గ్రామానికి చెందిన మాస్టర్, మహేష్,నవాబ్ పేట్, పట్టణ పరిధిలో కరాటే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి మహిళలకు ఆత్మస్థైర్యం, పెంపొందించే విధంగా క్లాసులు నిర్వహించారు. మాస్టర్ మహేష్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు గతంలో చాలా మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా మాస్టర్స్ మహేష్ , అనిల్‌కుమార్ లు మాట్లాడుతూ%౧% స్పర్షితను స్పూర్తిగా తీసుకొని తల్లిదండ్రులు వారి పిల్లలకి శిక్షణ ఇప్పించాలని , అమ్మాయిల ఆత్మరక్షణ కొరకు శిక్షణ ఇస్తానని , ముఖ్యంగా అమ్మాయిలు నేటి సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని మాస్టర్ తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ తెలుగు దినపత్రిక

## యుద్ధంలోకి లాగుతున్న ఇజ్రాయిల్

ఇజ్రాయిల్ ఘర్షణను పెంచుతూ పోయి, పశ్చిమాసియాను ఒక విస్తృత యుద్ధంలోకి లాగుతోంది. ఇజ్రాయిల్ ఒక సంవత్సర కాలంగా, గాజాలో మానవ హననాన్ని సాగిస్తోంది. లెబనాన్ లోకి ఇజ్రాయిల్ ప్రవేశించిన తరువాత, ఇరాన్‌పై మిస్సైల్ దాడికి తెగబడింది. తరువాత ఈ యుద్ధం ఇంకేమాత్రమూ గాజాకు పరిమితమై లేదు. ఇరాన్ అణు స్థావరాలపై దాడి చేస్తామని ఇజ్రాయిల్ బెదిరిస్తున్నదంటే, అమెరికా ఇస్తున్న పూర్తి మద్దతుతోనే. ఇప్పుడీ యుద్ధం ఒక నూతన దశలోకి ప్రవేశించింది. యెమెన్, సిరియా, ఇరాక్‌లు ఈ విస్తృతమైన యుద్ధంలోకి లాగబడ్డాయి. దీని ప్రభావం, ఆ ప్రాంతాన్ని దాటి ప్రపంచమంతటా పడుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ జంటగా యుద్ధాన్ని పెంచుతూ తగ్గిస్తూ, చెలగాటమాడుతున్నాయి.కానీ ఒక విషయం మరచిపోకూడదు. మొదటి ప్రపంచ యుద్ధం రావాలని, ఆనాడు ఏ పెద్ద దేశమూ అనుకోలేదు. తాము ఒక మెట్టు ఎక్కి బెదిరిస్తే, మిగిలిన వాళ్ళు ఒక మెట్టు దిగుతారని అనుకున్నారు. అమెరికన్ తాత్వికుడు జార్జ్ శాంతాయన చెప్పినట్టు 'గతాన్ని మరిచిపోయిన వాళ్ళు, మళ్లీ ఆ గతాన్ని పునరావృతం కానిస్తారు.' అయితే ఈసారి మాత్రం ఏ యుద్ధమైనా అణ్వాయుధాలతోనే ముగుస్తుంది. ఇరాన్‌లో ఉన్న న్యూక్లియర్ వ్యవస్థలను, ఇజ్రాయిల్ నాశనం చేయటానికి అమెరికా సహకరిస్తే, ప్రపంచ యుద్ధం ప్రారంభమైనట్టు అనుకోవాల్సి వస్తుంది. రష్యా, చైనాలు పశ్చిమాసియాలో మరో నయా వలసను అంగీకరించడం కష్టం కాబట్టి, ఈ పరిస్థితి తప్పదు. ఇజ్రాయిల్ దాడి గాజాలోని, పౌర సదుపాయ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసింది. 42,000 మందిని చంపింది. భవనాలను కూల్చింది. 19 లక్షల ప్రజలను–అంటే పది మందిలో తొమ్మిది మందిని–నిర్వాసితులను చేసింది. పాలస్తీనా గతకాలపు విధ్వంసం (నక్బా) సందర్భంగా, శరణార్థులుగా వచ్చిన వాళ్లే గాజాలో ఎక్కువ. గాజా ప్రజలపై ఆ యుద్ధం కొనసాగుతూనే ఉంది. అయితే ఆ యుద్ధం లెబనాన్ లోకి ప్రవేశించిన తర్వాత, ఇరాన్ లాగబడ్డ తర్వాత, గాజాపై దృష్టి కొంచెం తగ్గింది. యుద్ధం ఒక విస్తృత దృశ్యం. దాన్ని అర్థం చేసుకునే ముందు, కొన్ని అంశాలను మనం గుర్తుపెట్టుకోవాలి. సిరియాలో ఉండే ఇరాన్ ఎంబసీపై బాంబులు వేసి, ముఖ్యులైన మిలటరీ, దౌత్య ప్రముఖులను చంపింది. సిరియాపై దాడి చేసిందీ ఇజ్రాయిలే. ఓస్లో ఒప్పందం పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా వాగ్దానం చేస్తే, దాన్ని తుంగలో తొక్కి, అత్యధిక భాగాన్ని ఆక్రమించిందీ ఇజ్రాయిలే. అయితే గాజా యుద్ధాన్ని, ఇజ్రాయిల్ ఎందుకని లెబనాన్ లోకి విస్తరించింది? పేజర్, వాకీటాకీ పేలుళ్లు, హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రుల్లా హత్య, లెబనాన్ దురాక్రమణ–ఇవేవీ తెలివైన సైనిక చర్యలుగా అనిపించవు. గాజా అనే చిన్న ముక్కలో ఉన్న, హమాస్‌ను మట్టుబెట్టాలనే సైనిక లక్ష్యాన్ని కూడా, ఒక సంవత్సరం అయినా, ఇజ్రాయిల్ సాధించలేకపోయింది. అమెరికా, నాటోలకున్న వ్యూహాత్మక లక్ష్యాలతో, ఇజ్రాయిల్‌కు వున్న మరో రెండు లక్ష్యాలను అనుసంధానించి చూస్తే తప్ప, ఇజ్రాయిల్ చర్యలు అర్థం కావు. పశ్చిమాసియాపై అమెరికా నియంత్రణ బలహీనపడటం (పాశ్చాత్య దేశాలు, అట్లాంటిక్ దేశాలు దీన్నే మధ్య ప్రాచ్యం అంటారు), ఇరాన్ బలపడటం, ఇరాక్ దురాక్రమణ తర్వాత అక్కడి ప్రజల నుండి దూరం కావడం, సిరియా పాలకుల్ని తొలగించ లేకపోవడం–ఇవన్నీ అమెరికా దృష్టిలో వైఫల్యాలు. అవసరమైతే సైన్యాన్ని ఉపయోగించి అయినా, పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా ప్రయోజనాలను కాపాడాలనే కార్టర్ సిద్ధాంతానికి ముప్పు ఏర్పడినట్లు అమెరికా భావిస్తున్నది. గల్ఫ్ చమురును అమెరికా తన సొంత చమురు నిల్వల వ్యూహాత్మక పొడిగింపుగా భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. అలాగే ఇజ్రాయిల్‌ను కూడా, తమకు మిలిటరీ పొడిగింపుగా అమెరికా, నాటో, పాశ్చాత్య దేశాలు భావిస్తున్నాయి. అందుకే ఇజ్రాయిల్‌కు ఈ దేశాలన్నీ సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నాయి. ఇరాన్‌తో శత్రుత్వం కొనసాగుతూ వస్తుందన్నా, ఇరాక్, సిరియా, లిబియా దేశాల ప్రభుత్వాలను కూల్చాలనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నా దానికి కారణం ఇవే. హమాస్ రాజకీయ విభాగపు అధినేత ఇస్మాయిల్ హనియే హత్యతో, గాజాలో జరుగుతున్న యుద్ధం, ఇరాన్‌కు లెబనాన్‌కూ విస్తరించింది. హనియే ఖతార్‌లో ఉండేవాడు. కానీ ఇరాన్ కొత్త అధ్యక్షుడి ప్రమాణ స్వీకార ఉత్సవంలో పాల్గొనడానికి, టెహ్రాన్ వచ్చి హత్యకు గురయ్యాడు. దానికి ప్రతిగా ఇజ్రాయిల్‌పై పరిమిత మిస్సైల్ దాడి చేసినా, ఇరాన్ ఆ సమాచారం అమెరికాకు, దాని మిత్రదేశాలకు ముందే ఇచ్చింది. అయితే, నస్రుల్లా హత్యకు ప్రతీకారంగా ఇరాన్ జరిపిన దాడి చాలా తీవ్రమైనది. మూడు స్థాయిలలో ఉన్న ఇజ్రాయిల్ రక్షణ ఛత్రాన్ని (మిస్సైల్ దాడిని తట్టుకోగలిగిన ఛత్రం) అది ఛేదించగలిగింది. 'మిలిటరీ వాచ్' పత్రిక కథనం ప్రకారం, ఇజ్రాయిల్ విమాన స్థావరాలలో ఉండే వాయుసేనకు (ఎఫ్ 35, ఎఫ్ 15) తీవ్రమైన నష్టమే జరిగింది. టెల్అవీవ్‌లో ఉండే ఇజ్రాయిల్ వేగు సంస్థ మొసాద్ కేంద్ర కార్యాలయం నేల మట్టమైందని కూడా ఆ వెబ్‌సైట్ ప్రకటించింది. ఈ కథనం వాస్తవమైతే, ఇజ్రాయిల్ గొప్పలు చెప్పుకొనే మూడంచెల రక్షణ వ్యవస్థ డొల్లతనం వెల్లడవుతున్నది. ప్రపంచమంతా ఒక పద్ధతి ప్రకారమే నడవాలని ప్రకటించుకునే, ఈ పాశ్చాత్య దేశాల, నాయకులు–ముఖ్యంగా మాజీ వలసాధిపత్య దేశాలు–ఇరాన్ అంతర్జాతీయ సూత్రాలను ఉల్లంఘించిందని, దాని పర్యవసానాలు తప్పవని రంకెలు వేస్తున్నాయి. ఇజ్రాయిల్ నస్రుల్లాను హత్య చేసినప్పుడు, పేజర్లు వాకీటాకీలు పేల్చి హిజ్బుల్లా సభ్యుల, పౌరుల ప్రాణాలు తీసినప్పుడు, ఆమోద ప్రాయంగా వీరే తలలాడించారు. అటువంటి రహస్య పేలుడు పనిముట్లను వాడటాన్ని అంతర్జాతీయ చట్టాలు నిషేధించాయి. లెబనాన్‌లో జరిగిన ఈ పేలుళ్లను, ఒక విధమైన టెర్రరిజం అని ఒక మాజీ సిఐఏ డైరెక్టర్ లియో పానెట్టా అన్నాడు. సప్లై చెయిన్ల ద్వారా ఉగ్రవాద చర్యలు జరిగితే, ఇక తర్వాత తరువాత ఏం జరుగుతుందో? అని ప్రజలు భయభ్రాంతులవుతారని ఆయన అన్నాడు. హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ (మధ్య ప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా) లామాఫఖి వ్యాఖ్యానిస్తూ" మానవ హక్కుల చట్టాలు, సంప్రదాయాలూ బూబీ ట్రాప్స్ వాడకాన్ని నిషేధిస్తున్నాయి. ఎందుకంటే, లెబనాన్‌లో లాగా, అవి అమాయకులైన పౌరుల ప్రాణాలకు ముప్పు తెస్తాయి కాబట్టి" అన్నాడు. బీరుట్‌లో బహుళ అంతస్తుల భవనాన్ని, అమెరికాలో తయారైన బాంబులు, ఎయిర్ క్రాఫ్టల సహాయంతో కూల్చి, నస్రుల్లాను, ఇతర పౌరులను చంపారు. నస్రుల్లా ఎన్నికలలో పాల్గొంటున్న ఒక రాజకీయ పక్ష నాయకుడని, వైద్యశాలలు, విద్యాలయాలు లాంటి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని తెలిసిందే. కానీ దీనిపై అమెరికానోరు విప్పడం లేదు. అమెరికాలో తయారైన ఎఫ్ 15 విమానాలు మోసుకొచ్చిన 2 వేల పౌండ్ల బాంబులు, 80 వేల కేజీల పేలుడు పదార్థాలతో భూగర్భ బంకర్లను, భవనాలను పేల్చివేశారు.

# తెలంగాణ ఆడబిడ్డలకు ఘోర అవమానం..

### – ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి

జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో, (మే 15): రుద్రమదేవి, సమ్మక్క సారాలక్క లాంటి వీర వనితలు పుట్టిన నేలపై తెలంగాణ ఆడబిడ్డలకు ఘోర అవమానం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందాల పోటీలకు వచ్చిన యువతుల కాళ్లను వరంగల్ మహిళలతో రాష్ట్ర ప్రభుత్వం కడిగించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై సబితా ఇంద్రారెడ్డి సీరియస్‌గా స్పందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆడబిడ్డల పరువు తీసింది.తెలంగాణ రాష్ట్రమే కాదు, భారత దేశ మహిళల పరువును ప్రపంచం ముందు తీసిన సంఘటన ఇది. వీర వీరవనితలు రాణి రుద్రమదేవి, సమ్మక్క %-% సారలమ్మలు పుట్టిన నేలపైనే ఈ ఘోర అవమానం జరగడం చాలా బాధాకరం. తెలంగాణ ఆడబిడ్డలతో మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు కడిగించడం, తుడిపించడం దుర్మార్గమైన,అవమానకరమైన,అత్యంత




హీనమైన చర్య..యావత్ మహిళ లోకానికి ఈ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి అని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, తమ కాళ్ళ మీద తాము నిలబడేలా చేసి మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచుతామని గొప్పగా చెప్పే ప్రభుత్వం విదేశీయుల కాళ్ళు కడిగించటం ద్వారా ఏ సంకేతాలు ఇస్తున్నారు. ఒకవైపు రాష్ట్రంలోని మహిళలు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడుస్తుంటే, మరోవైపు విదేశీ అందగత్తెలకు తమ కాళ్లు కడిగి, టవల్‌తో తుడిపించడం దేనికి సంకేతం ఇస్తుంది అని ఆమె ప్రశ్నించారు.

గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మిషన్ భగీరథతో మహిళల నీటి కష్టాలు తీరిస్తే, నేడు బిందెలా కష్టాలు తెచ్చి పాత రోజులు తెచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. కానీ ఆడబిడ్డల గౌరవాన్ని తగ్గించిన ఏ ఒక్కరు కూడా బాగుపడినట్టు చరిత్రలో లేదు. అదేవిధంగా మహిళల ఉసురు తగిలి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా పతనం అవ్వటం ఖాయం అని ఎమ్మెల్యే సబిత హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో బీజేపీ వెర్సస్ ఎంఐఎం!




హైదరాబాద్: హైదరాబాద్‌లో లోకల్‌బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంది. పువ్వు పార్టీ–పతంగి పార్టీ సై అంటే సై అంటున్నాయి. చివరి నిమిషంలో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలోకి దిగింది బీజేపీ.. గెలిచేందుకు తగినంత బలం లేకపోయినా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తామని కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన బీజేపీ నేతలు.. నామినేషన్ల చివరి రోజు అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ నేత గౌతమ్‌రావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. పార్టీ కార్యకర్తగా ఉన్న తనకు ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం దక్కిందని.. ఈ ఎన్నికల్లో తాము ఎలా గెలుస్తామో ముందు ముందు తెలుస్తుందని గౌతమ్ రావు అన్నారు. పార్టీ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు మరోవైపు గౌతమ్‌రావు ఎంపికపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో అభ్యర్థులే లేరా అని ప్రశ్నించారు. అధిష్ఠానానికి సీనియర్లు, కార్యకర్తలు కనబడలేదా ? అని కామెంట్ చేశారు. అయితే గౌతమ్‌రావు అభ్యర్థిత్వంపై అభ్యంతరం వ్యక్తం చేసిన రాజాసింగ్‌తో మాట్లాడతామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నా రు మరోవైపు ఈ ఎమ్మెల్సీ ఎన్నికతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫెవికాల్ బంధం బట్టబయ లైం దని ఆరోపించారు కేంద్రమంత్రి బండి సంజయ్. మొన్న డీలిమిటేషన్ తో ఏకమైన ఈ రెండు పార్టీలు.. పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశాయన్నారు. లేటెస్ట్‌గా మజ్లిస్‌ను గెలిపించేందుకు ఈ రెండు పార్టీలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇదే నిదర్శనమన్నారు.

ఎంఐఎం అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్:


ఎంఐఎం తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్ నా మినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎమ్మెల్సీ, కార్పొరేటర్‌గా పనిచేసిన మిర్జా.. మరోసారి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఇక ఈ ఎన్నికల్లో తమ గెలుపు లాంఛనమే అని ఎంఐఎం ధీమా వ్యక్తం చేసింది.మొత్తం 112 మందికి ఓటు హక్కు: ఈ ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పుకోవడంతో పోటీ ఎంఐఎం,బీజేపీ మధ్యే ఉండబోతోంది.

## ఉరి వేసుకున్న హోమ్ గార్డ్



జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్( మే 15): నేరేడ్ మెట్ లోని వినోభానగర్ లో నివాసం ఉంటూ హైదరాబాద్ కమిషనరేట్ తిరుమలగిరి డివిజన్ ఏసీపీ కార్యాలయంలో డ్రైవర్ గా పనిచేస్తున్న గొర్ల యాదగిరి కుమారుడు గొర్ల గోవర్ధన్ యాదవ్ (33) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి వివాహం అయింది మరియు భార్య గౌతమీ , ఇద్దరు పిల్లలు ఉన్నారు. మే 14న ఉదయం 6 గంటలకు మృతుడు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి డ్యూటీ కి వెళ్ళకుండా తిరిగి రాత్రి 10 గంటలకి మద్యం తాగి వచ్చి కిరాయికి ఉంటున్న ఇంట్లోకి వెళ్లి పడుకున్నాడు. మరుసటి రోజు ఉదయం 09 గంటలకి మృతుని భార్య గౌతమీ , మృతుని తమ్ముడు ఉదయ ప్రకాష్ యాదవ్ వెళ్లి తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో మెయిన్ డోర్ పగులగొట్టి చూడగా చీరతో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుని కూతురు గత కొంత కాలంగా కిడ్నీ సంబందిత వ్యాది తో బాధపడుతూ చికిత్స తీసుకుంటుంది, ఆ బాధ లో మృతుడు మద్యానికి బానిసై నిన్న రాత్రి తన కిరాయి ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయి ఉంటాడని మృతుని తమ్ముడు ఉదయ ప్రకాష్ యాదవ్ తెలిపారు

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు అడుగులు



ఆదిలాబాద్: విమానాశ్రయం ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఆదిలాబాద్ వాసుల కలలు త్వరలోనే ఫలించబోతున్నాయి. ఆదిలాబాద్‌లోని రక్షణశాఖకు సంబంధించిన వైమానిక విమానాశ్రయంలో.. పౌరవిమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని, దీంతో పాటు.. పౌర విమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు ఆయన క్లారిటీ ఇచ్చారు.స్థానిక ప్రజలు, పలు పార్టీల నాయకుల నుంచి కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 29 జనవరి, 2025 నాడు లేఖ రాశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. వ్యక్తిగతంగా కలిసి ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూములను ప్రజావసరాలకు సద్వినియోగం చేసేలా చొరవ తీసుకోవాలని కోరామని అన్నారు. దీనిపై వారు రక్షణ శాఖ అధికారులతో చర్చించిన తర్వాత సానుకూల నిర్ణయాన్ని తెలియజేస్తూ నిన్న లేఖ రాశారని చెప్పుకొచ్చారు. రాజ్‌నాథ్ సింగ్ సానుకూల స్పందనను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందుకుగానూ ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నామని చెప్పారు.'పత్తి వ్యాపారా నికి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు ఆదిలాబాద్ ప్రధానమైన కేంద్రంగా ఉంది. దీంతోఆదిలాబాద్ తో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల నుంచి.. విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసే విషయంలో చొరవ తీసుకోవాలని దశాబ్దాలుగా డిమాండ్ వినిపిస్తోంది. దీనిపై నేను 7 జూలై 2022,15 ఫిబ్రవరి 2023నాడు నాటి ముఖ్యమంత్రికి లేఖలు రాశాం. ఐదేళ్లుగా ఈ విషయంపై పదే పదే నేను ప్రస్తావించాను. అయినా రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'అటు, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే విమానయాన సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభిస్తామని 2021 అక్టోబర్ లో నాటి పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా నాటి సీఎంకి లేఖ రాశారు. కానీ దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. కానీ ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. వారి నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని.. నేను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో, పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడుకి లేఖలు రాయ డంతో పాటుగా వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేశాను' అని చెప్పారు. వరంగల్ విమానాశ్రయానికి అనుమతులు లభించడం తో.. విమానా శ్రయం ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేసి ఇస్తే.. ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు కూడా వేగవంతం చేసేందుకు వీలవుతుంది. తద్వారా వీలైనంత త్వరగానే.. వరంగల్ ప్రజల స్వప్నం సాకారం కానుంది. గత నెలలో.. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటు, ఇందుకు సంబంధించిన పురోగతి తదితర విషయాలను నేను, రామ్మోహన్ నాయుడు సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించాం' అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.రీజనల్ కనెక్టివిటీ స్కీమ్ ? ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ పథకంలో భాగంగా.. దాదాపు 620 రూట్లలో ఇప్పటికే హైదరాబాద్‌కు 60 రూట్స్ (10%) ఆపరేషన్‌లో ఉన్నాయి. వరంగల్, ఆదిలాబాద్‌లో కూడా విమానాశ్ర యాల సేవలు ప్రారంభిస్తే తెలంగాణకు ఉడాన్ కింద మరికొన్ని రూట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇది ప్రజల ప్రయాణంతో పాటుగా.. ఈ ప్రాంతంలో వాణిజ్యాభివృద్ధికి కూడా తోడ్పడనుంది' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.ఆదిలాబాద్‌లో గతంలోనే విమానాశ్రయం ఉండేది. దీన్ని సైనిక అవసరాల కోసం మాత్రమే వినియోగించేవారు. కాలక్రమేణా.. వివిధ కారణాలతో రక్షణ శాఖ కార్యకలాపాలు కూడా ఆగిపోయాయి. ఇప్పుడు ఈ విమానాశ్రయాన్ని తిరిగి యాక్టివేట్ చేయడం రక్షణశాఖకు, పౌర సేవలకు ఎంతో ఉపయోగపడనుంది. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి పట్ల నరేంద్రమోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం. విమానాశ్రయాల ఏర్పాటు వల్ల మన వ్యవసాయ ఉత్పత్తులు.. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునేందుకు మార్గం సుగమం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఆయా విమానాశ్రయాల ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించడంతో పాటుగా సంపూర్ణ సహకారం అందిస్తే.. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు వీలైనంత త్వరగా ప్రజలకు సేవలందిస్తాయి' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# దుగోడ మూగబోయింది!



### మళ్లీ గల్ఫ్ గమ్యమవుతున్నది
### కుప్పకూలిన నిర్మాణ రంగం
### ఆరునెలలుగా పనిలేక వడ్రంగి యాతన
### తప్పని పరిస్థితిలో ఉపాధి కోసం గల్ఫ్ బాట

ఎల్లారెడ్డిపేట : వ్యవసాయం, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం ఒకదా నితో ఒకటి ముడిపడిన రంగాలు. ప్రస్తుత ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ప్రతి రంగం కుదేలైం ది. దీంతో కార్మికులు, వృత్తిదారులు, యువకులు తిరిగి గల్ఫ్‌బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వడ్రంగి కొడిమోజు దేవేందరే ఉదాహరణ. ఏడేండ్లుగా చేతినిండా వృత్తి పనితో సంతోషంగా గడిపిన దేవేందర్‌కు భార్య లహరి, ఇద్దరు పిల్లలు సాత్విక్, సుచిత్ ఉన్నారు. పిల్లలను ఉన్నంతలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తూ ఉన్న ఊళ్లో సంతోషంగా బతకాలని కలలుగన్నాడు. ఇంతలో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మార డం.. రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గుముఖం పట్టడం.. ఫలితంగా నిర్మాణ రంగం ఆగమైంది. దీనికితోడు ఇసుకపై విపరీతమైన ఆంక్షలు విధించడంతో ఇండ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆరు నెలలుగా పనిలేక ఇబ్బందులు పడుతున్నాడు. అద్దెకు తీసుకుని నడిపిస్తున్న కార్పెంటర్ షెడ్డుకు అద్దె చెల్లించడం, పిల్లల చదువులకు ఫీజులు కట్టడం, కుటుంబాన్ని పోషించడం తలకు మించిన భారంగా మారింది. 2006లో ఊళ్లో పనిలేక బహరాన్, 2015లో సౌదీలో గడిపిన దేవేందర్.. ఆ తర్వాత సొంత ఊళ్లో పని ఉన్నదని 2017లో స్వగ్రామానికి చేరుకున్నాడు. 7 సంవత్సరాలు సంతోషంగా గడిపాడు. మళ్లీ ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో మస్కట్ బా ట పడుతున్నాడు. భార్యాపిల్లలను విడిచి వెళ్లాలని లేకపోయినా వెళ్లక తప్పడం లేదని దేవేందర్ ఆవేదనగా తెలిపాడు.

## అమెరికాలో ట్రంప్ నిర్ణయాలు
## 50 రాష్ట్రాల్లో 1200లకు పైగా
# ప్రాంతాల్లో ర్యాలీలు..



హైదరాబాద్: ప్రెసిడెంట్‌గా పగ్గాలు చేపట్టాక.. ట్రంప్ నిర్ణయాలు ప్రపంచ దేశాల ఆగ్రహానికి కారణమవుతున్నాయ్. ఇదంతా అమెరికా కోసమేనని చెబుతున్నా.. అక్కడి జనం ఒప్పుకోవట్లేదు. పైగా.. ట్రంప్ మీదే మండిపడుతున్నారు. అమెరికా వీధుల్లో నిరసనలు చూశాక ఒకటే అనిపించింది..అమెరికా ఒక్కసారిగా భగ్గుమంది. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పద విధానాలు, నిర్ణయాలకు వ్యతిరేకంగా.. దేశవ్యాప్తంగా నిరసనలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయ్. రిపబ్లికన్ పార్టీ పాలనా తీరుపై అగ్రరాజ్యం ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రెసిడెంట్ ట్రంప్ తీరును నిరసిస్తూ దేశమంతటా నిరసనలు వెల్లువెత్తాయి. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత జరిగిన అతి పెద్ద నిరసన ఇదే.హ్యాండ్స్ ఆఫ్ పేరుతో వేలాది మంది అమెరికన్లు వీధుల్లోకి వచ్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 50 రాష్ట్రాల్లో 1200లకు పైగా ప్రాంతాల్లో జరిగిన ఈ ర్యాలీలు.. అమెరికా చరిత్రలోనే ఓ అరుదైన సంఘటనగా నిలిచాయ్. నిరసనలకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారి.. మొత్తం వరల్డ్ అటెన్షన్‌ని గ్రాబ్ చేశాయ్. కార్మిక యూనియన్లు, పౌర హక్కుల సంఘాలు, స్వలింగ సంపర్క సంస్థలు, న్యాయవాద సంఘాలు, సీనియర్ సిటిజన్ల లాంటి 150 సంఘాలు చేపట్టిన ఈ హ్యాండ్సాఫ్ నిరసనలకు జనం వెల్లువెత్తారు. అధ్యక్షుడిగా ట్రంప్ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి లేటెస్ట్ టారిఫ్‌ల విధింపు వరకు ప్రతి నిర్ణయం, ప్రతి విధానంపై.. అమెరికా అంతటా వేలాది మంది జనం రోడ్ల మీదికొచ్చి నిరసన తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగాల తగ్గింపు, ప్రజా సేవల్లో కోత, ఆర్థిక వ్యవస్థ, వలస విధానం, మానవ హక్కులు, వివాదాస్పద సామాజిక విధానాలపై.. అన్ని రకాల గ్రూపులు, సంస్థలు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించాయ్.ముఖ్య ంగా.. వాషింగ్టన్ డీసీలోని నేషనల్ మాల్, న్యూయార్క్, లాస్ ఏంజిల్స్ ప్రాంతాల్లో నిరసనలు ఉద్ధృతంగా సాగాయి. ప్రజాస్వామ్య సంస్థల ను ట్రంప్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఇక.. ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలో నడుస్తున్న డోజ్.. ఫెడరల్ ఏజెన్సీల్లో విధిస్తున్న భారీ కోతలపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ ప్రయత్నాలన్నీ పన్ను చెల్లింపుదారులకు బిలియన్లకొద్దీ డాలర్లు ఆదా చేస్తుందని చెబుతున్నా.. చాలా మంది అమెరికన్లు ఈ చర్యలను సమర్థించడం లేదు. ముఖ్యమైన సేవలను నిర్వీర్యం చేస్తున్నట్లుగానే చూస్తున్నారుమరోవైపు.. సామాజిక భద్రతా కార్యాలయాల మూసివేత, ఉద్యోగుల తొలగింపు, హెల్త్ కేర్ నిధులకు కోత విధించడంపైనా జనం మండిపడుతున్నారు. హ్యాండ్స్ ఆఫ్ అవర్ డెమోక్రసీ, డైవర్సిటీ ఈక్విటీ ఇంక్లూజన్ మేక్స్ అమెరికా స్ట్రాంగ్ అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రెసిడెంట్ ట్రంప్, ఎలాన్ మస్క్ తీసుకుంటున్న నిర్ణయాలు.. ప్రపంచానికే సవాల్ విసురుతున్నాయని, వలసదారుల పట్ల ప్రభుత్వ వైఖరి దారుణంగా ఉంటోందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ట్రంప్ ప్రపంచాన్నే ఆర్థికమాంద్యంలోకి నెట్టబోతున్నాడనే నినాదాలు వినిపించాయి.2017 తర్వాత.. అమెరికాలో ఇంత పెద్ద ఎత్తున నిరసనలు జరగడం ఇదే తొలిసారి. అమెరికా వ్యాప్తంగా సాగిన ఈ ఆందోళనలు, జనం నుంచి వ్యక్తమైన ఆగ్రహావేశాలు.. ట్రంప్ పాలనపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తిని స్పష్టంగా చాటాయి. నిరసనకారులంతా.. తమ డిమాండ్లని బలంగా వినిపిస్తూ.. ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలని డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ ఈ వీడియోలు, సందేశాలు వైరల్‌గా మారాయి. దాంతో.. ఈ ఉద్యమం మరింత ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది. ప్రజల అవసరాలతో పనిలేకుండా ట్రంప్ సర్కార్ వ్యవహరిస్తోందనే చర్చ అమెరికాలో మొదలైంది. ట్రంప్ ప్రభుత్వం సరైన దిశలో నడవట్లేదని.. ఉద్యోగాల్లో భారీ కోతలతో అమెరికాలో సేవలు, వనరులపై తీవ్ర ప్రభావం పడుతోందనే ఆందోళన జనంలో ఉంది. విద్య, సామాజిక భద్రత,మెడికేర్,మాజీ సైనికు హక్కులు సహా ఏదీ సవ్యంగా లేవంటున్నారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లపైనా ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అనేకమంది అమెరికన్లు కూడా ఈ విషయంలో ఆగ్రహంగానే ఉన్నారు. అయినాసరే.. ఈ నిరసనల్ని వైట్ హౌజ్ తోసిపుచ్చింది. ప్రెసిడెంట్ ట్రంప్ ఆలోచనలు స్పష్టంగా ఉన్నాయని.. అర్హులైన పౌరుల సామాజిక భద్రత, ఆరోగ్య సాయానికి ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపింది.ఏదేమైనా.. అమెరికా ప్రజలు రోడ్లపైకి వచ్చి తెలిపిన నిరసనలు.. కేవలం ట్రంప్ విధానాలపైనే కాదు..అమెరికా రాజకీయ వ్యవస్థలోని లోతైన విభేదాలని కూడా బయటపెడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అమెరికా ప్రజల ఆందోళనలపై చర్చ జరుగుతోంది. దాంతో.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు.. ప్రెసిడెంట్ ట్రంప్ ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది. మరోవైపు.. అమెరికా భవిష్యత్ ఏ దిశగా సాగుతుందనేది కూడా ఇంట్రస్టింగ్‌గా మారింది.

# సంక్షేమ పథకాలకు..నిధులు ఎలా..?

హైదరాబాద్, ,: రేవంత్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. వాటిల్లో ముఖ్యంగా రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వీటి అమలు కోసం భారీగా నిధులు కావాలి. దీంతో ఆర్థిక శాఖ అధికారులు నిధుల సేకరణపై ఫోకస్ పెట్టారు.తెలంగాణ ప్రభుత్వం రెండు సంక్షేమ పథకాలను ప్రతిష్మాత్మకంగా భావిస్తుంది. వీటి అమలు కోసం మూడు నెలల్లో దాదాపు రూ.15 వేల కోట్లు అవసరం అని తెలుస్తోంది. ఆ నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ వనరులు, రుణాలపై ఆర్థిక శాఖ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని.. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే అమలు చేయనున్నారు.రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా.. ఇప్పుడు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అర్హులను ఎంపిక చేసి.. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్థిక సాయం మంజూరు పత్రాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ పథకానికి రూ.6 వేల కోట్లు ఇస్తామని స్పష్టం చేసింది. జూన్ 2 నాటికి ఈ పథకం కోసం రూ.6 వేల కోట్లు నిధులు కావాలి.ఇక జూన్ నుంచే ఖరీఫ్ పంటల సాగు సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. రైతు భరోసాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు పంటలకు కలిపి.. రూ.18 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. వీటిలో రూ.9 వేల కోట్లను ఖరీఫ్ సాగుకు పెట్టుబడి కింద వ్యవసాయ శాఖకు విడుదల చేయాలి.ఈ రెండు పథకాల అమలు కోసం జూన్ నాటికి రూ.15 వేల కోట్లను ఆర్థిక శాఖ సిద్ధం చేయాల్సి ఉంది. దీంతో అధికారులు నిధుల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇతర శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కూడా మరిన్ని నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల ఒకటిన ప్రారంభం కాగా.. ఈ నెల 8న బాండ్ల విక్రయం ద్వారా రూ.2 వేల కోట్ల నూతన రుణాల సేకరణకు ఆర్థికశాఖ ప్రయత్నాలు చేస్తోంది.మరోవైపు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ఈ ఏడాది ఇంధన శాఖకు బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు కేటాయించింది. వీటి నుంచి విద్యుత్ సంస్థలకు రాబోయే మూడు నెలల్లో రూ.5 వేల కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉంటుంది. యువ వికాసం, రైతు భరోసా,విద్యుత్ రాయితీ నిధులు తప్పనిసరిగా విడుదల చేయాల్సినవే.అందుకే వాటికే ప్రాధాన్యమిస్తూ సమీకరిస్తున్నట్లు ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ భూముల విక్రయాల ద్వారా నిధులు సమీకరించవచ్చని తొలుత భావించారు. కానీ ప్రస్తుతం అది సాధ్యం కాదని తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం ఫోకస్ పెడుతోంది. కొత్త రుణాల సేకరణపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు, పాత రుణాలపై వడ్డీలు,అసలు కిస్తీల చెల్లింపులకే సరిపోతోం దని తెలుస్తోంది. ప్రభుత్వం ప్రాధ్యాన్యత ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఇవ్వాల్సిన నిధులను.. ఇతర మార్గాల ద్వారా సమీకరించక తప్పదని అధికారులు చెబుతున్నారు. అమలు చేయాల్సిన తేదీలు దగ్గరపడుతున్న నేపథ్యం లో.. అధికారులు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# అటవీ భూముల కబ్జాపై నిరూపిస్తే
# పదవికి రాజీనామా చేస్తా: కడియం

వరంగల్: ఓవైపు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు, అటవీ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. అటవీ భూములను నాశనం చేసి భూముల్ని వేలం వేయాలని చూస్తుందని పిటిషన్లు రావడంతో అటు సుప్రీంకోర్టులో కంచె గచ్చబౌలి భూములపై విచారణ జరిగింది. తమ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశాలు జారీచేసింది. అదే సమయంలో రాష్ట్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అటవీ భూముల కబ్జా జరిగిందని ఎమ్మెల్యే కడియంశ్రీహరిపై ఆరోపణలు వచ్చాయి. హనుమకొండ జిల్లా దేవునూరు అటవీ భూముల కబ్జా వివాదంపై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. హనుమకొండలోని దేవునూర్ గుట్టల్లో అటవీ భూమిని కడియం శ్రీహరి కబ్జా చేస్తున్నారని కొన్ని రోజులుగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపిస్తున్నారు. ఆ కబ్జా ఆరోపణలపై కడియం శ్రీహరి అంతే ఘాటుగా స్పందించారు. హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ.. అటవీ భూమి కబ్జా చేయలేదని స్పష్టం చేశారు. అవన్నీ నిరాధారమైన ఆరోపణలు అని.. దమ్ముంటే అక్కడ కబ్జా జరిగినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్యలు, రెవెన్యూ అధికారులను, అటవీ అధికారులను, మీడియాను తీసుకెళ్ళి అందరి సమక్షంలో మీరే విచారణ జరిపి 2 వేల ఎకరాలు కబ్జా చేశాడని తేలితే నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చాలెంజ్ చేశారు.ఇంకా పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్య ఇళ్లలో తాను గులాంగా పని చేస్తానన్నారు. ఒకవేళ నిరూపించకపోతే రాజేశ్వర్ రెడ్డి, రాజయ్య లు ఇద్దరు కడియంశ్రీహరి ఇంట్లో గులాములుగా పని చేస్తారా అంటూ ఎమ్మెల్యే సవాలు విసిరారు. రాజేశ్వర్ రెడ్డి, రాజయ్యలకు తెలంగాణ పౌరుషం, చీము, నెత్తురు ఉంటే తనపై చేసిన ఆరోపణలకుగానూ తాను చేసిన ఈ సవాలును స్వీకరించాలని కడియం ఛాలెంజ్ చేశారు. అటవీ భూములను కాపాడి, పట్టా భూములు కలిగిన రైతులకు న్యాయం చేస్తానని కడియం శ్రీహరి అన్నారు. దేవునూరు గుట్టలను ఎకో టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు పాటుపడుతా అన్నారు.

# సిటలో ఆగని డ్రగ్స్ దందా..!?

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో డ్రగ్స్‌కు ఏమాత్రం అడ్డుకట్ట పడడంలేదు. దాంతో.. డ్రగ్స్ చైన్ లింకులకు బ్రేకులు వేసే పనిలో పడ్డారు తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు, పోలీసులు.. డ్రగ్స్ సప్లయ్ చైన్‌లో నైజీరియన్లు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించి.. వారికి చెక్ పెట్టారు. డ్రగ్స్ విక్రయం ద్వారా వచ్చిన డబ్బును విదేశాలకు హవాలా మార్గంలో పంపిస్తున్న గ్యాంగ్కు చెందిన ముగ్గురు నైజీరియన్లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.12.5 లక్షల విలువైనఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకుసంబంధించిన వివరాలను నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు.. ఈ ముఠాపై గత మూడు నెలలకుపైగా నిఘా పెట్టినట్లు వెల్లడించారు. డ్రగ్స్ తీసుకున్నాక చెల్లింపులు జరుపుతున్నట్లు గుర్తించామని, వీటిని డెలివరీ చేసేందుకు అమ్మాయిలను ఉపయోగిస్తున్నట్లు దర్యాప్తులో తెలిసిందన్నారు.టోలీచౌకి ప్రాంతంలో డ్రగ్స్ డెలివరీ చేసిన యువతిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా.. సంచలన విషయాలు వెలుగు చూశాయన్నారు.. డ్రగ్స్ ముఠా సభ్యులు ఆ యువతికి రూ.50,000 ఇచ్చినట్లు వెల్లడించారు. వారితోనే డైరక్ట్ డీల్ చేసి.. డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్నారు. గత 5 సంవత్సరాలుగా డ్రగ్స్ ద్వారా నైజీరియాకు వెళ్లిన డబ్బుల వివరాలు సేకరించామని, భారత్‌తో పాటు అమెరికాలోనూ నైజీరియన్లు డ్రగ్స్ సప్లై చేస్తున్నారని తెలిపారు.డ్రగ్స్ కావాలని కస్టమర్లు డబ్బులు చెల్లించే లావాదేవీల ద్వారా నిందితులను పట్టుకున్నామన్నారు. కస్టమర్లు డబ్బులు చెల్లించేందుకు 15 మంది యువతుల బ్యాంక్ ఖాతాలు ఇచ్చారని, అమెరికా యువతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు గుర్తించామని శాండిల్య తెలిపారు. 5 సంవత్సరాల్లో డ్రగ్స్ కోసం భారత్, అమెరికా, నైజీరియన్ల మధ్య కోట్ల రూపాయలు లావాదేవీలు జరిగినట్లు తెలిపారు. అమెరికా నుంచి డబ్బులు నేరుగా నైజీరియాకు వెళ్లకుండా మొదట భారత్‌కు పంపిస్తారని, ఇక్కడి నుంచి హవాలా మార్గంలో నైజీరియాకు తీసుకెళ్తారని తెలిపారు.

## వేలానికి 500 భారీ మొసళ్లు..
## ప్రారంభ ధర రూ.4.71 కోట్లు
### చైనా కోర్ట్ ఆదేశంతో అమ్మకానికి



బీజింగ్: రకరకాల అరుదైన, సాధారణ వస్తువులను వేలం వేయడం గురించి మనం వినే ఉంటాం. అయితే చైనాలో ఇటీవల కోర్టు ఆదేశాలతో ఏకంగా 500 సియామీ మొసళ్లను వేలానికి పెట్టడం అందరినీ ఆకర్షించింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం.. వ్యక్తులెవరైనా మే 9 వరకు సాగే ఈ వేలంలో పాల్గొని భారీ మొసళ్లను తమ సొంతం చేసుకోవచ్చు. గాంగ్‌డాంగ్ హెూంగీ సంస్థ నిర్దిష్ట ఆర్థిక లావాదేవీలను నిర్వర్తించడంలో విఫలం కావడం తో ఆ సంస్థ పెంచుతున్న మొసళ్లను వేలం వేయాలని షెన్‌జెన్ నన్‌షన్ ప్రజా కోర్ట్ ఆదేశించింది. మొసళ్ల ప్రారంభ ధరను నాలుగు మిలియన్ల యువాన్లుగా (రూ.4.71 కోట్లు) నిర్ణయిం చింది. చైనాలో మొసళ్లను పెంచి వాటిని వ్యాపార వస్తువులుగా అమ్ముకోవచ్చు.

# కమలదళంలో కోల్డ్ వార్..?




హైదరాబాద్ : “రాజాసింగ్‌కు ఎవరూ సాటిలేరు.. ఆయన హిందూ ధర్మానికి ఆదర్శం. సర్వం హిందూ ధర్మం కావాలన్నదే రాజాసింగ్ లక్ష్యం”. ఈ మాటలు అన్నది మరెవరో కాదు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. సడెన్‌గా బండి అంతలా రాజాసింగ్‌ను ఎందుకు పొగడాల్సి వచ్చింది? హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ముందు.. శ్రీరామనవమి శోభాయాత్రకు ముందు.. రాజాసింగ్‌ను బండి సంజయ్ ఎందుకు ఆకాశానికి ఎత్తారు? ఏదైనా వ్యూహం దాగుందా? మరెవరిపైనైనా మైండ్ గేమ్ ఆడారా? అనే చర్చ నడుస్తోంది.ఈమధ్య గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రెచ్చిపోతున్నారు. కిషన్‌రెడ్డి టార్గెట్‌గా తూటాల్లాంటి మాటలు వదులుతున్నారు. బీజేపీ పెద్ద లీడర్ ఓ మేకప్‌మేన్ అని.. అతని టేబుల్ సాఫ్ చేసే వాళ్లకే పదవులు ఇస్తున్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. గౌతమ్‌రావును ఎమ్మెల్సీ కేండిడేట్‌గా ఎంపిక చేయడంపై రాజాసింగ్ కస్సుమన్నారు. అన్నిపదవులు మీవాళ్లకేనా? బీజేపీలో సీనియర్లు, కార్యకర్తలు లేరా? అంటూ కిషన్‌రెడ్డిపై డైరెక్ట్ అటాక్ చేశారు. ఇక, స్టేట్ బీజేపీ అధ్యక్షుడి ఎంపికపైనా తరుచూ కాంట్రవర్సీ కామెంట్స్ చేస్తుంటారు. ముఖ్యమంత్రులతో బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసే వారికి కాకుండా.. నిఖార్సైన కాషాయ లీడర్లకు, ప్రజల కోసం పోరాటం చేసే వారికే ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వాలంటూ రచ్చ రాజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తనపై పీడీ యాక్ట్ పెట్టి జైల్లో పెట్టడం వెనుకా.. తమ పార్టీ పెద్దలే ఉన్నారని కూడా కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. ఇలా రెగ్యులర్‌గా కమలం పార్టీలో కలకలం రేపే రాజాసింగ్‌కు బండి సంజయ్ లాంటి బిగ్ లీడర్ సరిలేరు నీకెవ్వరూ అనే రేంజ్‌లో కితాబు ఇవ్వడం బీజేపీలో ఆసక్తిగా మారింది. శ్రీరామనవమి సందర్భంగా పాతబస్తీలో వేలాదిమందితో భారీ శోభయాత్ర చేపట్టారు రాజాసింగ్. ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చినా ఇవ్వకున్నా.. శోభయాత్ర విషయంలో తగ్గేదేలే అని తేల్చి చెప్పారు. శాంతిభద్రతల సమస్యంటూ పోలీసులు టెన్షన్ పడుతున్నారు. పార్టీ తరఫున రాజాసింగ్‌కు ఎలాంటి సపోర్ట్ లేకున్నా.. ఆయన తన సొంత ఇమేజ్‌తో పాతబస్తీలో మజ్లిస్ పార్టీ ముందు తొడగొట్టాలని చూస్తున్నారు. జై శ్రీరాం.. జై బీజేపీ.. జై యోగి.. జై మోదీ నినాదంతో రాజాసింగ్ ఓల్డ్ సిటీ హీరోగా నిలుస్తున్నారు. ఆయనలోని కరుడుగట్టిన హిందుత్వ భావాజాలం వల్లే.. రాజాసింగ్‌ను పార్టీ అధిష్టానం సైతం ఏమీ అనలేక పోతోంది. లేదంటేనా.. కిషన్‌రెడ్డి ఎప్పుడో తొక్కేసేవారని పార్టీ వర్గాలే అంటున్నాయి. గతంలో ముస్లింలపై ఓ కాంట్రవర్సీ కామెంట్ చేయగా.. ఆయన్ను పార్టీ నుంచి కొన్ని నెలలు సస్పెండ్ చేశారు. ఎన్నికల ముందు మళ్లీ కాషాయ టికెట్ ఇచ్చి.. పాతబస్తీలో బీజేపీకి రాజాసింగ్ మినహా మరెవరూ దిక్కులేరని చెప్పకనే చెప్పారు. అలా సోలోగా ఎదిగి.. బండి సంజయ్‌తో సో బెటర్ లీడర్ అనిపించుకు నే స్థాయికి చేరారు రాజాసింగ్.

బండి సంజయ్ కావాలనే రాజాసింగ్‌ను ప్రమోట్ చేస్తున్నారా? అనే డౌట్ కూడా లేకపోలేదు. తెలంగాణ బీజేపీలో తీవ్ర వర్గపోరు నడుస్తోందనేది ఓపెన్ సీక్రెట్. కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు లాంటి వాళ్లు ఓ టీమ్ అంటారు. బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, రాజాసింగ్ తదితరులు మరో వర్గంగా ముద్ర పడ్డారు. బండి సంజయ్ తరఫున రాజాసింగ్ గట్టిగా మాట్లాడుతుంటారు. అసలే ఫైర్ బ్రాండ్ లీడర్ కావడంతో ఆయన నోటికి కంట్రోల్ ఉండదు. కిషన్‌రెడ్డి మెతక లీడర్ అని.. ఆయన అధ్యక్షుడిగా ఉంటే తెలంగాణలో బీజేపీ బలపడే ఛాన్సే లేదని గతంలోనే రాజాసింగ్ రచ్చ చేశారు.

## భారత్‌ను రష్యాతో పోలుస్తూ అక్కసు వెళ్లగక్కిన కెనడా



భారత్– కెనడా మధ్య దౌత్యవిబేధాలు కొనసాగుతూనే ఉన్నాయి. భారత దౌత్యవేత్తలపై విమర్శలు చేయడాన్ని మాత్రం కెనడా మర్చిపో వట్లేదు. ఇకపోతే, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మాటల్నే విదేశాం గమంత్రి మెలానీ జోలీకూడా ప్రస్తావించారు. కెనడాలో మిగిలిన దౌత్యవేత్తలపై నిఘా ఉంచామంటూ భారత్‌పై విమర్శల ప్రక్రియను కొనసాగించారు. అంతటితో ఆగకుండా భారత్‌ను రష్యాతో పోలుస్తూ అక్కసు వెళ్లగక్కారు. వియన్నా కన్వెన్షన్ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడితే సహించేది లేదని మెలానీ వ్యాఖ్యానించారు. మెలానీ జోలీ మాట్లాడు తూ.. "కెనడా దేశ చరిత్రలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు చూడలేదు. మన దేశ గడ్డపై విదేశీ అణచివేత జరగదు. ఐరోపాలో ఇలాంటి ఘటనలు చూశాం.. జర్మనీ , బ్రిటన్ విషయంలో రష్యా విదేశీ జోక్యా నికి పాల్పడింది. మేం ఈ విషయంలో చాలా దృఢంగా ఉన్నాం" అని వెల్లడించారు. కాగా, ఖలిస్థానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పేరును కెనడా సర్కార్ చేర్చింది. అతడ్ని విచారించాల్సి ఉందని భారత విదేశాంగ శాఖకు కెనడా సందేశం చేసింది. ఇక, దీనిపై భారత్ తీవ్రంగా మండిపడింది. నిరసనగా ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించింది.

## ఇజ్రాయెల్ దాడిలో కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకున్నాడు..
# అయినా అతడి ఎటాక్ స్టైలే వేరు

అది 2007 సంవత్సరం. పాలస్తీనాపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. అలా ఇజ్రాయెల్ బలగాలు చేసిన బాంబు దాడుల్లో అప్పటికే దాదాపు 4 వేల మందికిపైగా జనం చనిపోయారు. ఆనాటి ఇజ్రాయెల్ దాడుల్లో పాలస్తీనాకు చెందిన ఒక కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోయింది. కానీ ఆ కుటుంబంలో ఒక్కరు మాత్రం ప్రాణాలతో బతికిబయటపడ్డారు. ఆయనే ఖలీల్ అల్ హయ. ఇప్పుడు ఇక్కడ మనం చూస్తున్న వ్యక్తే ఆ ఖలీల్ అల్ హయ. పాలస్తీనాతో పాటు హమాస్ ఆయన్ని సింపుల్‌గా ఖలీల్ హయ అని పిలుచుకుంటుంది. హమాస్ ఉగ్రవాద సంస్థ చీఫ్ యాహ్యా సిన్వార్ మృతి చెందిన తరువాత ఇప్పుడు అతడే హమాస్ సంస్థకు కొత్త చీఫ్ అయ్యారు. పాలస్తీనాలో పాలు తాగే పిల్లల నుండి కురు వృద్ధులదాకా ఇజ్రాయెల్ అంటే నరనరాన ఆగ్రహావేశాలు నింపుకుని ఉంటారు. కొంచెం వయసొచ్చిందంటే చాలు.. చేతికి ఒక తుపాకీ ఇస్తే ఇజ్రాయెల్‌పై యుద్ధానికి వెళ్లడానికే సిద్ధంగా ఉంటారు. కానీ ఇజ్రాయెల్ జరిపిన బాంబు దాడిలో ఖలీల్ హయ తన కుటుంబం మొత్తాన్ని పొట్టనపెట్టుకున్నప్పటికీ.. అతడి వైఖరి మాత్రం మిగతా వారి కంటే కొంత భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే.. హమాస్‌లో మిగతా కమాండర్స్ అందరూ ఇజ్రాయెల్‌తో యుద్ధానికి కాలు దువ్వుతున్న సమయంలోనూ.. హమాస్ తరపున కాల్పుల విరమణ ఒప్పందానికి చొరవ తీసుకున్న ఏకైక వ్యక్తి ఖలీల్. 2014 లో హమాస్ – ఇజ్రాయెల్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో అతడి పాత్రే కీలకం. ఆవేశంతో ఊగిపోయే రకం కాకుండా ప్రాక్టికల్‌గా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే మనిషిగా ఖలీల్‌కి పేరుంది. దౌత్యపరమైన సంప్రదింపుల్లో ఖలీల్ దిట్ట అని అంటుంటారు. అవసరమైతే, అంతర్జాతీయ స్థాయిలో ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య మధ్యవర్తిత్వం చేసేవారితోనూ సత్సంబంధాలున్న వ్యక్తిగా ఖలీల్ పేరు చెబుతుంటారు. అందుకే ఒకవేళ ఇజ్రాయెల్‌తో మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలన్నా.. లేదంటే రెండు దేశాల మధ్య శాంతిస్థాపన దిశగా ఏదైనా ముందడుగు వేయాలన్నా, అందుకు ఖలీల్ కరెక్ట్ పర్సన్ అనే అభిప్రాయం వ్యక్తమైంది. కాకపోతే ఖలీల్ కూడా హమాస్ చీఫ్‌గా వచ్చీ రావడంతోనే హమాస్ వైఖరేంటో గట్టిగానే బల్లగుద్దీ మరీ చెప్పారు. ఇజ్రాయెల్ తమ డిమాండ్లను ఒప్పుకునే వరకు తమ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ వాసులను విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఇజ్రాయెల్ తీరు మారనంతవరకు ఈ యుద్ధం ఇలాగే కొనసాగుతుందని ఖలీల్ తేల్చిచెప్పేశారు. ఇప్పటివరకు హమాస్‌ని ముందుండి నడిపించిన యాహ్యా సిన్వార్ ఇజ్రాయెల్ చేతిలో హతమవడంతో అతడి స్థానంలోకి ఈ ఖలీల్ హయ వచ్చారు. హమాస్ చీఫ్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత ఖలీల్ అల్ హయ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయెల్ చేతిలో హత్యకు గురైన యాహ్యా సిన్వార్‌ని ఖలీల్ అమరవీరుడితో పోల్చారు. సిన్వార్ తన జీవితం మొత్తాన్ని పాలస్తీనా స్వేచ్ఛ కోసమే త్యాగం చేశారని గుర్తుచేసుకున్నారు. ఆయన తన తుదిశ్వాస వరకు దేశం కోసమే పోరాడారని తెలిపారు. పాలస్తినా గడ్డ కోసం పోరాడిన సిన్వార్, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా, ఎప్పటికీ అమరుడిగా నిలిచిపోతాడన్నారు. సిన్వార్ గురించి ఖలీల్ తన సందేశాన్ని చదువుతూ.. యువకుడిగా ఉన్నప్పటి నుండే సిన్వార్ తుపాకీ పట్టుకున్నారన్నారు. ఇజ్రాయెల్‌పై దాడి కేసులో ఆ దేశం అతడిని అరెస్ట్ చేసి జైల్లో పెట్టింది. ఇజ్రాయెల్ జైల్లో ఉన్నప్పుడు కూడా యాహ్యా సిన్వార్ తన పోరాటాన్ని ఆపలేదని ఖలీల్ గుర్తుచేసుకున్నారు. ఇజ్రాయెల్ జైలు నుండి విడుదలయ్యాక మరింత చురుకుగా పనిచేశారని పాలస్తీనాకు సిన్వార్ చేసిన సేవలను స్మరించుకున్నారు. జెరుసలేం రాజధానిగా పాలస్తీనా దేశం తమ భూభాగాన్ని స్వాధీనం చేసుకునే వరకు హమాస్ పోరాటం ఆగదని, అప్పటివరకు ఇజ్రాయెల్ నుండి తీసుకొచ్చిన బందీలను విడిచిపెట్టే ప్రసక్తే లేదని ఖలీల్ స్పష్టంచేశారు. ఇప్పటివరకు కతార్‌లో ఉంటూ వచ్చిన ఆయన ఇకపై పాలస్తీనాకు తన స్థావరాన్ని మార్చనున్నారు. ఆయన గతంలోనే హమాస్ మిలిటరీ ఆపరేషన్స్‌లో కీలక పాత్ర పోషించారు. పాలస్తీనా రాజకీయాల్లోనూ ఖలీల్ హయాకు మంచి సంబంధాలున్నాయి. అందుకే పాలస్తీనా హక్కుల కోసం పోరాడుతున్న మిలిటెంట్ సంస్థగా పేరున్న హమాస్‌కి ఇప్పుడు ఖలీల్ హయ కొత్త బాస్ అయ్యారు. యాహ్యా సిన్వార్ మృతిపై అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ స్పందించారు. అతడి మృతి ఇజ్రాయెల్, అమెరికాకే కాదు.. ప్రపంచ దేశాలకు కూడా ఒక గుడ్ న్యూస్ అని బైడెన్ అన్నారు. ఎలాగూ సిన్వార్ చనిపోయాడు




కనుక ఒకవేళ హమాస్ కాల్పుల విరమణ ఒప్పందానికి ముందుకు రావాలనుకుంటే ఇదే సరైన అవకాశం అని అమెరికా అభిప్రాయపడింది. ఇంతకాలం కాల్పుల విరమణ ఒప్పందానికి సిన్వార్ పెద్ద అడ్డుగా నిలిచాడని అమెరికా చెప్పుకొచ్చింది. అంటే.. రాబోయే రోజుల్లో మరోసారి కాల్పుల విరమణ ఒప్పందానికి ముందుకు రావాల్సిందిగా అమెరికా ఖలీల్‌ని ఆహ్వానించే అవకాశం లేకపోలేదని బైటడెన్ మాటలు చెప్పకనే చెబుతున్నాయి. ఇప్పటివరకు ఇజ్రాయెల్ దాడుల్లోనే చనిపోయిన గాజా వాసులు ఇప్పుడు ఎదుర్కొంటున్న మరో అతి పెద్ద శత్రువు ఆకలి. ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య యుద్ధంతో పాలస్తీనాలో ఒక భాగమైన గాజాలో ఆహారానికి కొరత ఏర్పడింది. యుద్ధం కారణంగా అక్కడ పంటలు పండించే పరిస్థితి లేదు.. బయటి నుండి లోపలికి దిగుమతి లేదు. దీంతో గాజా ప్రస్తుతం ఆకలి చావుల దిశగా పయణిస్తోందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. సిద్ధాంతాలు, లక్ష్యం పరంగా ఒకవైపు ఇజ్రాయెల్‌తో యుద్ధం విషయంలో గాజా వెనక్కి తగ్గలేని పరిస్థితి. మరోవైపు సొంతగడ్డపైనే అనేక ప్రతికూల పరిస్థితులు నెలకున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో హమాస్ చీఫ్‌గా ఖలీల్ బాధ్యతలు చేపట్టారు. దీంతో ఖలీల్ హయ తరువాతి నిర్ణయం ఏ విధంగా ఉండనుందనేదే ప్రస్తుతం యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది.


## పొదుపు సంఘాల్లో ఆన్‌లైన్ చెల్లింపులు

కొయ్యలగూడెం:పోలవరం మండలంలోని ఓ గ్రామంలో రెండు నెలల కిందట పొదుపు సంఘం మహిళలు కట్టమని ఇచ్చిన రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించకుండా సంబంధిత ప్రతినిధులు దుర్వినియోగం చేశారన్న అనుమానంతో ఆ సభ్యులు ఆందోళన చేయాల్సి వచ్చింది. రెండేళ్ల కిందట కొయ్యలగూడెం మండలంలోని ఓ గ్రామంలో అదే తరహా ఆరోపణలొచ్చాయి. ఇకపై ఇటువంటి అక్రమాలకు చోటు లేకుండా సభ్యుల ఖాతాల నుంచే రుణ వాయిదాలు చెల్లించేలా డీఆర్డీఏ చర్యలు చేపట్టింది. స్త్రీనిధి రుణాలకు సంబంధించి వాయిదాల చెల్లింపుల కోసం డీఆర్డీఏ యంత్రాంగం పొదుపు సంఘాల మహిళలకు పేటీఎం యంత్రాల వినియోగంపై అవగాహన కల్పిస్తోంది. తద్వారా రుణ గ్రహీతలు చెల్లించిన సొమ్ములు పక్కదారి పట్టకుండా అక్రమాలను నిరోధించవచ్చని భావిస్తోంది. ఏలూరు జిల్లాలో ప్రయోగాత్మక పరిశీలన కోసం ఒక్కో మండలానికి అయిదారు చొప్పున మొత్తం 90 యంత్రాలను అధికారులు సరఫరా చేశారు. క్షేత్ర స్థాయిలో జరిగే సమావేశాల్లో ఏపీఎంలు, సీసీలు పొదుపు సంఘాల మహిళలకు పేటీఎం యంత్రాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. పొదుపు సంఘాల మహిళల రుణ వాయిదాలను నేరుగా బ్యాంకు ఖాతాలకు చెల్లించకుండా వీవోఏలకు కట్టడం పరిపాటిగా వస్తోంది. ఈ క్రమంలో కొన్నిచోట్ల వీవోఏలు ఆ సొమ్ములను సక్రమంగా చెల్లించకుండా చేతివాటం చూపుతు న్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

ఇలాంటి అవకతవక లకు అడ్డుకట్ట వేసేందుకు సభ్యులు తమ ఖాతాల ద్వారానే ఆన్‌లైన్ చెల్లింపులు జరిపేలా పేటీఎం యంత్రాలు ఉపయోగపడనున్నాయి. అంతేకాకుండా రసీదు పొందడం, ఇంకా ఎంత బాకీ ఉందో తెలుసు కునే వెసులుబాటు కూడా ఉంటుందని డ్వాక్రా కొయ్యలగూడెం ఏపీ ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు.

## ఆయుష్షు పెంచుకోవాలంటే ఏం చేయాలి..?
# గరుడ పురాణంలో చెప్పిన సూచనలు..!

భూమిపై పుట్టిన ప్రతి ఒక్క జీవి ఎప్పుడో ఒకప్పుడు చనిపోవాల్సిందే. కాకపోతే ఒక జీవి ముందు, ఒక జీవి తరువాత చనిపోతుంది. అందుకు మనిషి కూడా అతీతుడు కాదు. మనిషైనా ఏదో ఒక రోజున ఎలాగోలా చనిపోవాల్సిందే. దాన్ని ఎవరూ ఆపలేరు. కానీ.. మనిషి జీవిత కాలాన్ని మాత్రం నిజంగా ఆపవచ్చు. అంటే.. చావు నుంచి తప్పించుకోవడం అని కాదు. కానీ చావును కొంత ఆలస్యంగా వచ్చేలా చేయడం అన్నమాట. అంటే.. కొంత ఎక్కువ కాలం జీవించడం అని మనం తెలుసుకోవాలి. మరి అలా ఎక్కువ కాలం జీవించాలంటే ఏం చేయాలి..? అంటే.. ఇందుకు మీ వద్ద సమాధానం ఉండకపోవచ్చు. కానీ గరుడ పురాణం మాత్రం అందుకు సమాధానాలు చెబుతోంది. మరి ఆ సమాధానాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందామా. గరుడ పురాణంలో ఏముంటుందో మనందరికీ తెలిసిందే కదా. మనిషి తన జీవిత కాలంలో చేసే ఆయా పనులకు నరకంలో ఎలాంటి శిక్షలు పడతాయో అందులో క్లియర్‌గా రాసి ఉంటుంది. అయితే కేవలం ఇదే విషయం మాత్రమే కాకుండా మనిషి జీవిత కాలం పెరగాలంటే ఏం చేయాలో కూడా అందులో రాసి ఉంది. మరి మన జీవిత కాలాన్ని పెంచుకునేందుకు గరుడ పురాణం ప్రకారం ఎలాంటి సూచనలు పాటించాలో ఇప్పుడు తెలుసుకుందాం. రాత్రి పూట భోజనంలో ఎవరూ కూడా పెరుగు తినరాదు. ఎందుకంటే ఇది ఆ సమయంలో సరిగ్గా జీర్ణం కాదట. దీంతో అనారోగ్య సమస్యలు వచ్చి జీవిత కాలం, ఆయుర్దాయం తగ్గిపోతుందట. కనుక రాత్రి పూట పెరుగు తినరాదు. రాత్రి పూట చాలా మంది డిన్నర్ చేయగానే వెంటనే నిద్రపోతారు. కానీ అలా చేయరాదట. తిన్న వెంటనే నిద్రిస్తే అనారోగ్యాలు కలిగి జీవిత కాలం తగ్గుతుందట. కాబట్టి తిన్న వెంటనే నిద్రపోరాదు. రాత్రి పూట మాంసాహారం తినరాదు. తింటే అది సరిగ్గా జీర్ణం కాక అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతుంది. దీంతో అనారోగ్యం కారణంగా మనిషి ఆయుర్దాయం తగ్గుతుంది. త్వరగా చనిపోతాడు. కనుక రాత్రి పూట మాంసాహారం మానేస్తే జీవిత కాలాన్ని, ఆయుర్దాయాన్ని పెంచుకో వచ్చు. కొందరు ఉదయం ఆలస్యంగా నిద్ర లేస్తారు. అలా చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చి అవి జీవిత కాలాన్ని తగ్గిస్తాయట. కనుక ఎవరైనా ఉదయాన్నే త్వరగా నిద్రలేవాలి. ఆలస్యం చేయకూడదు. ఇక ఉదయాన్నే నిద్ర లేవడం వల్ల ఆ సమయంలో వచ్చే గాలిని పీల్చుకుంటే అనారోగ్య సమస్యలు కూడా దూరమవుతాయట. శ్మశానాల్లో దహన కార్యక్రమాలను నిర్వహించగానే వెంటనే ఇంటికి చేరుకోవాలి. ఎందుకంటే అక్కడ ఉండే బాక్టీరియాలు మన శరీరాల్లోకి వెళితే అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. వాటి వల్ల మనం త్వరగా చనిపోవాల్సి వస్తుంది. దీంతో జీవిత కాలం తగ్గుతుంది. కనుక ఎవరైనా ఎక్కువ కాలం జీవించాలంటే.. శ్మశానాల్లో దహన కార్యక్రమాలు ముగియగానే వెంటనే ఇంటికి చేరుకోవాలి.



అక్కడే వెయిట్ చేయరాదు. ఇక చివరిగా గరుడ పురాణం ప్రకారం.. భార్యాభర్త ఎవరైనా రాత్రి పూటే శృంగారంలో పాల్గొనాలట. ఉదయం చేయకూడదట. చేస్తే ఆయుష్షు తగ్గుతుందని, ఆ సమయంలో మనిషి శరీర రోగ నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుందని, అలాంటి సమయం లో శృంగారంలో పాల్గొంటే వచ్చే అనారోగ్య సమస్యలు మనిషి ఆయుర్దా యాన్ని తగ్గిస్తాయని గరుడ పురాణం చెబుతోంది. కనుక దంపతులు రాత్రి పూటే శృంగారంలో పాల్గొంటే మంచిది. ఆయుష్షు పెరుగుతుంది.

## అంబానీకి ఊహించని ఎదురుదెబ్బ..
# జియో కోట కూలిపోతోందా..?




రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత తమ్ముడు పతనం తర్వాత టెలికాం రంగంలో జియో వెంచర్ తో ప్రవేశించిన సంగతి తెలిసిందే. కోట్ల మంది యూజర్లను ఉచితాలను ఆకట్టుకున్న అంబానీ ప్రస్తుతం పెద్ద దెబ్బ ఎదుర్కొంటున్నారు. ఇతరుల వ్యాపారాలను ఆఫర్లతో పడగొట్టి కట్టిన జియో కోట ప్రస్తుతం బీటలు వారుతోందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి అనంత్ అంబానీ పెళ్లి తర్వాత అంబానీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. చిన్న కుమారుడు అనంత్ వివాహం తర్వాత రిలయన్స్ జియో తన టారిఫ్ రేట్లను పెంచిన సంగతి తెలిసిందే. ఇది పెద్ద బ్యాక్ ఫైర్ ను చూసింది. జియో పెంపుతో ఇతర ప్రైవేటు ఆపరేటర్లు సైతం తమ ఛార్జీల మోత మోగించాయి. దీంతో యూజర్లు దీనిని నిరసిస్తూ జియో నుంచి బీఎస్ఎన్ఎల్ కి తిరిగి రావాలంటూ పెద్ద ట్రోలింగ్ కూడా జరిగింది. తక్కువ ఖర్చుకే ప్రభుత్వ సంస్థ సేవలను అందించటంతో జియో యూజర్లు ఒక్కసారిగా జంప్ కొట్టడం ప్రారంభించారు. టారిఫ్ రేట్ల పెంపు తర్వాత ఆ ప్రభావం యూజర్ బేస్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో సెప్టెంబరుతో ముగిసిన రెండవ త్రైమాసికంలో దాదాపు 10,900,000 మంది వినియోగదారులు జియోను వదిలి వెళ్లిపోయారు. ఇంత భారీ స్థాయిలో యూజర్లు జియోను విడిచిపెట్టడం అనేది నిజానికి కంపెనీకి ఆందోళనకలిగిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించటానికి జియో ప్రయత్నాలు ప్రారంభిస్తోందని తెలుస్తోంది. అయితే ఒక కంపెనీ టారిఫ్‌లలో కొన్ని మార్పులను తీసుకువచ్చినప్పుడల్లా వినియోగదారులు తమ లాయల్టీని మార్చుకోవడం ఒక సాధారణ ధోరణిగా గమనించబడింది. ప్రస్తుతం తన 5జీ సేవలను ఇతర ఆపరేటర్ల కంటే వేగంగా దేశవ్యాప్తంగా విస్తరించిన వేళ యూజర్ బేస్ గతంలో ఉన్న 1.30 కోట్ల నుంచి 17 లక్షలు పెరిగి 1.47 కోట్లకు చేరుకున్నారని కంపెనీ వెల్లడించింది. ఇదే క్రమంలో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయందీంతో యూజర్లు దీనిని నిరసిస్తూ జియో నుంచి బీఎస్ఎన్ఎల్ కి తిరిగి రావాలంటూ పెద్ద ట్రోలింగ్ కూడా జరిగింది. తక్కువ ఖర్చుకే ప్రభుత్వ సంస్థ సేవలను అందించటంతో జియో యూజర్లు ఒక్కసారిగా జంప్ కొట్టడం ప్రారంభించారు. టారిఫ్ రేట్ల పెంపు తర్వాత ఆ ప్రభావం యూజర్ బేస్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో సెప్టెంబరుతో ముగిసిన గతంలో ఉన్న రూ.181.7 నుంచి ప్రస్తుతం రూ.195.1కి పెరగగా, మొత్తం సబ్‌స్క్రైబర్ బేస్ క్షీణించింది. జియో తన యూజర్ బేస్‌కు సంబంధించి పరిస్థితి గురించి కంపెనీకి తెలుసునని, లాభాలపై ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపదని తెలిపింది. తమ కస్టమర్లకు అత్యుత్తమ 5జీ నెట్‌వర్క్‌ను అందించడంపైనే తమ దృష్టి అని కంపెనీ వెల్లడించింది.

## ఇజ్రాయెల్ ప్రధాని నివాసం లక్ష్యంగా డ్రోన్ దాడి

పశ్చిమాసియాలో తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆందోళనకర ఘటన చోటు చేసుకుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇంటివైపు డ్రోన్ దూసుకొచ్చింది. సిజేరియాలోని ఆయన నివాసం లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఎవరూ గాయపడలేదని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది. ఆ సమయంలో ప్రధాని, ఆయన సతీమణి నివాసంలో లేరని పేర్కొంది. ఇక ఈ ఉదయం లెబనాన్‌వైపు నుంచి డ్రోన్లు దూసుకొస్తున్న తరుణంలో ఇజ్రాయెల్‌లో సైరన్లు మోగాయి. ప్రస్తుతం ఇజ్రాయెల్.. హమాస్, హెజ్‌బొల్లా గ్రూప్‌లు అంతమే లక్ష్యంగా దాడులు చేస్తోంది. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌తో సహా నాయకత్వ హోదాలో ఉన్న పలువురిని నెతన్యాహు సేనలుహతమార్చాయి. అలాగే లెబనాన్‌లోని హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా సహా పలువురు కీలక కమాండర్లను మట్టుపెట్టింది. సిన్వర్ మృతి తర్వాత స్పందించిన హెజ్‌బొల్లా.. తమ పోరాట దశను మార్చేలా ప్రణాళికలు వేసుకున్నామని తెలిపింది. క్షిపణులు, డ్రోన్లతో దాడులు తీవ్రం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హెజ్‌బొల్లా కేంద్రమైన లెబనాన్ వైపు నుంచి మూడు డ్రోన్లు దూసుకొచ్చినట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. సిజేరియాలోకి ఒక భవనాన్ని డ్రోన్ ఢీకొట్టినట్లు తెలిపాయి. మరో రెండింటిని అడ్డుకున్నామని పేర్కొన్నాయి. ఇదిలా ఉంటే.. సిన్వర్ మృతితో యుద్ధం కీలకమలుపు తిరిగే అవకాశం ఉందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇజ్రాయెల్ మాత్రం తమ బందీలు




విడుదలయ్యేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేసింది. హమాస్ మిలిటెంట్లు ఆయుధాలను వదిలి.. బందీలను విడుదల చేస్తే వెంటనే యుద్ధం ముగిస్తామని నెతన్యాహు ప్రకటించారు. ఆపై హమాస్ తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడిపే అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే వెంటాడి మరీ వారిని హతమరుస్తామని హెచ్చరించారు. దానికి తగ్గట్టే ఉత్తర గాజాలోని జబాలియా శిబిరంపై శుక్రవారం రాత్రి ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. 33 మంది పాలస్తీనా వాసులు మృతి చెందగా.. అందులో 21 మంది మహిళలే ఉన్నారు. ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటివరకు 42,500 మందికి పైగా మృతి చెందినట్లు గాజా ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

## హెజ్‌బొల్లా ఆర్థిక మూలాలపై ఇజ్రాయెల్ టార్గెట్.. ఖాళీ అవుతోన్న బీరుట్ నగరం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌ను చంపిన నేపథ్యంలో ఇజ్రాయెల్ పై ప్రతీకార దాడులకు దిగుతామని లెబనాన్‌లోని హెజ్‌బొల్లాఇటీవల హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే టెల్ అవీవ్ మరిన్ని భీకర దాడులకు సిద్ధమైంది. ఈసారి హెజ్‌బొల్లా ఆర్థిక

మూలాలపై గురిపెట్టింది. రానున్న గంటల్లో బీరుట్ సహా లెబనాన్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున బాంబు దాడులకు పాల్పడనున్నట్లు ప్రకటించింది. "హెజ్‌బొల్లా ఉగ్ర కార్యకలాపాలకు ఆర్థికంగా అండగా ఉండే ప్రాంతాలకు సమీపంలో ఉన్న ప్రజలు వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలి" అని ఇజ్రాయెల్ మిలిటరీ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ హెచ్చరికలు జారీ చేశారు.

లెబనాన్ వ్యాప్తంగా ఉన్న 'అల్ ఖర్ద్ అల్ హసన్' బ్రాంచీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని వెల్లడించారు. 'అల్ ఖర్ద్ అల్ హసన్' అనేది లైసెన్స్ లేని గ్రే–మార్కెట్ బ్యాంక్. హెజ్‌బొల్లాకు నిధులు సమకూర్చే ప్రధాన ఆర్థిక వనరుగా పనిచేస్తోంది. లెబనాన్ వ్యాప్తంగా దీనికి దాదాపు 30 బ్రాంచీలు ఉన్నాయి.



# యువత చూపు.. మద్యపాన నిషేధం వైపు..!

ఆత్మకూర్(ఎస్): గట్టికల్‌లో మద్య నిషేధానికి కదిలిన యువకులు అర్ధరాత్రి వరకు గొడవలు, ఘర్షణలు, నలభై ఏళ్లకే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని ఇంటిపెద్ద మృతి, చిన్న వయసులోనే వితంతువుగా మారిన మహిళలు, వారిపై పిల్లల భారం, తాగొచ్చి భర్త చేసే అల్లరికి తాళలేక పుట్టింటికి వెళ్లిన భార్య.. ఆలూమగల పంచాయితీలో నలిగిన చిన్నారులు.. ఇవీ పల్లెల్లో విచ్చలవిడి మద్యం విక్రయాలతో కనిపిస్తున్న హృదయ విదారక దృశ్యాలు. పగలూ, రాత్రి మద్యం విక్రయించే గొలుసు దుకాణాలు పచ్చని సంసారాల్లో చిచ్చురేపుతున్నాయి. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఈ ఘటనలను కళ్లారచూసిన యువత మద్యపాన నిషేధం వైపు అడుగులు వేస్తోంది. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలంలో పలు గ్రామాల్లో యువ చైతన్యం మద్యం మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతోంది. మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలో 2015 సెప్టెంబరు 21 నుంచి మద్యపాన నిషేధం అమలులోకి వచ్చింది. తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొని పదో సంవత్సరంలోకి అడుగిడింది. ఈ గ్రామంలోని మహాసేన, యువ, వింగ్స్ తదితర యువజన సంఘాల యువకులు ఏళ్లతరబడి పట్టుదలతో కట్టడి చేయడంతోపాటు జరిమానాలు విధిస్తున్నారు. ఇస్తళాపురం గ్రామం స్ఫూర్తితో ఇటీవల అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గట్టికల్, పాతర్లపహాడ్ గ్రామాల్లో మద్యపానాన్ని నిషేధించాలంటూ తీర్మానాలు చేశారు. ఆ తీర్మానం గట్టికల్‌లో ఈ నెల 14 నుంచి, పాతర్లపహాడ్‌లో 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఉద్యమంలో యువజన సంఘాలు అఖిలపక్ష పార్టీలు, అధికారులకు,



పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా చైతన్యం కోసం ద్విచక్ర వాహన ర్యాలీలు తీశారు. ప్రతి గొలుసు దుకాణానికి వెళ్లి అవగాహన కల్పించి మూసి వేయించారు. గట్టికల్‌లో జైభారత్, సర్దార్, అరుంధతి, కంఠమహేశ్వర, లెనిన్, సర్వోత్తమ్, చైతన్య జ్యోతి, గోల్డెన్‌స్టార్, బంగారుగడ్డ యువజన సంఘాల సభ్యులు ఉద్యమంలో పాలుపంచుకున్నారు. పాతర్లపహాడ్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ యంగ్‌స్టార్ యువజన సంఘం, గోల్డెన్‌స్టార్, కౌండిన్య, నవోదయ యువజన సంఘం యువకులు అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్థులను చైతన్యపరిచారు. మండలంలో ముక్కుడుదేవులపల్లి, తుమ్మలపెన్‌పహాడ్‌లోనూ యువజన సంఘాల ప్రతినిధులు గొలుసు దుకాణాలను మూసి వేయించేందుకు గ్రామపెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

# ఉపాధి ప్రణాళికలు షురూ..!



భువనగిరి:ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కల్పిస్తుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు ఉన్న గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిరుపేదలకు బాసటగా నిలుస్తుంది. పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్టుకాల్వల పనులను చేపట్టారు. ఈ సారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది.ఎంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందు పరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల్లోని 1740 గ్రామ పంచాయతీలలో ఈ నెలాఖరు లోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం వెంటనే గ్రామాల్లో సదరు పనులను ఉపాధికూలీల ద్వారా చేపట్టనున్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల తీరుపై ప్రణాళికల రూపకల్పనకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభి వృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతితో పనులు గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై గాంధీ జయంతి రోజు నుంచి ఈ గ్రామసభల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు వరకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

# పల్లెల్లో దళారులు, దడువాయిల
# దందామోసపోతున్న పత్తి రైతులు



ఆత్మకూర్(ఎస్):ఆత్మకూర్(ఎస్)లో తప్పుడు తూకాల వ్యవహారంపై దళారులను నిలదీస్తున్న రైతులు ఇటీవల చివ్వెంల మండలానికి చెందిన ఓ వ్యక్తి, మరో దళారి కలిసి మూసీ ప్రాంతంలోని ఇటుకపహాడ్‌లో పత్తిని కొనుగోలు చేస్తుండగా తూకంలో తేడాలు రావడంతో రైతులు గొడవకు దిగారు. ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన ఓ పత్తి వ్యాపారి చివ్వెంల మండలం గుంజలూరులో ముగ్గురు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేశారు. ఒకసారి 74 కిలోలు తూకం వచ్చిన పత్తి బస్తాను అనుమానంతో రెండోసారి తూకం వేస్తే 81కిలోలకు పెరిగింది. ఏడు కిలోలు తేడా రావడంతో రైతులు ఆగ్రహించారు. కాంటాలను నిలిపేశారు. ఒక్క రోజులో వంద క్వింటాళ్ల పత్తి కాంటా వేస్తే అందులో తప్పుడు తూకం ద్వారా 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు కొన్నవారికి మిగలాలి.' ఇదీ పల్లెల్లో పత్తి కొనుగోలుకు దళారులు అనుసరిస్తున్న విధానం. ఈ మోసంలో తూకం వేసిన దడువాయి రోజూ రూ.5 వేల నుంచి 10 వేల వరకు దక్కితే, లక్షల రూపాయలు దళారుల జేబుల్లోకి వెళ్తున్నాయి. రోజూ ఇదే దందా.. ఇదే మోసం. పర్యవేక్షణ చేపట్టి అడ్డుకునే వారు లేరు. గ్రామాల్లో పత్తి కొంటామంటూ వచ్చే వ్యాపారులు ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతులు నిలువునా ముంచుతున్నారు. ఏళ్లకొద్దీ ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో తప్పుడు కాంటాలతో పత్తి వ్యాపారం మోసం చేస్తూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా విస్తరించుకుంటున్నారు. ముఖ్యంగా తూకంలో మోసం చేసి క్వింటాకు పది కిలోల వరకు రైతుకు తక్కువగా చూపిస్తున్నారు. దళారుల మోసాల కారణంగా రైతులు అప్పులపాలవుతున్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ రెండేళ్లుగా పత్తి వ్యాపారంలో దళారులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. తమకు నమ్మకమైన దడవాయిలను పెట్టుకొని గ్రామగ్రామాన బేరం చేస్తూ కొండి కాంటాలను ఉపయోగిస్తూ కర్షకులను నట్టేట ముంచుతున్నారు. కొండి కాంటాల వల్ల క్వింటాకు ఐదు నుంచి పది కిలోల వరకు రైతుకు తక్కువ తూకం చూపిస్తారు. ఆత్మకూర్(ఎస్) మండలకేంద్రంలో ఆదివారం రెండు వర్గాలుగా మారిన పత్తి దళారులు గ్రామ పంచాయతీలో గొడవ పడ్డారు. గమనించిన స్థానిక రైతులు వారికి ఎదురు తిరిగి కాంటాలలో చేస్తున్న మోసాలపై నిలదీశారు. ఏటా పత్తి దళారుల చేతుల్లో పడి వేలాది మంది రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

# కొలోస్ట్రమ్.. గొప్ప ఫుడ్ సప్లిమెంట్!

కొలోస్ట్రమ్ పేరు మనకు అంతగా పరిచయం లేకపోవచ్చు. కానీ, ఆవు ముర్రుపాలు లేదా జున్నుపాలనే ఇంగ్లిష్‌లో కొలోస్ట్రమ్ అంటారు. దూడకు జన్మనిచ్చిన తర్వాత ఆవు పొదుగు నుంచి కొన్ని రోజులపాటు విడుదలయ్యే ముర్రుపాలను 'ద్రవరూప బంగారం' (లిక్విడ్ గోల్డ్)గా భావిస్తారు. ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, యాంటిబాడీస్ పుష్కలంగా ఉండే ఆవు ముర్రుపాలు మన శరీర కణాల మరమ్మతు, గాయాలు మాన్పడం, రోగ నిరోధక వ్యవస్థ, పొట్ట ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయని వివిధ అధ్యయనాల్లో వెల్లడైంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ముర్రుపాలను భారతదేశంలో వేల సంవత్సరాల కిందటే ఆయుర్వేద వైద్యంలో ఉపయోగించారు. వీటిపై శాస్త్రీయ అధ్యయనం 1799లో క్రిస్టఫ్ విల్‌హెల్మ్ హూఫ్‌లాండ్ నిర్వహించాడు. మన ఆరోగ్యానికి అండగా నిలిచే ఆవు ముర్రుపాలు ఇప్పుడు పొడి, ట్యాబ్లెట్ల రూపంలో సప్లిమెంట్లుగా దొరుకుతున్నాయి. వీటి మేలు గురించి తెలుసుకుందాం.

అథ్లెట్ల ప్రదర్శన మెరుగుపడటానికి, వాళ్లు గాయాల నుంచి త్వరగా కోలుకోవడానికి కొలోస్ట్రమ్ సాయపడుతుంది. కొలోస్ట్రమ్‌లో ఇమ్యునోగ్లోబ్యులిన్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన రోగ నిరోధక వ్యవస్థకు గొప్పశక్తినిస్తాయి. దీంతో మనం ఇన్ఫెక్షన్ల బారినపడే ముప్పు తగ్గుతుంది. రోజుకు ఒకటి చొప్పున కొలోస్ట్రమ్ సప్లిమెంట్ తీసుకునే 79 శాతం మంది లాలాజలంలో యాంటి బాడీస్ మోతాదు పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. అలా ఈ సప్లిమెంట్లు మన శ్వాసనాళాన్ని ఇన్ఫెక్షన్ల బారినపడకుండా నివారిస్తాయట. అంతేకాదు.. కొలోస్ట్రమ్‌లో లాక్టోఫెరిన్, లైసోజైమ్ అనే యాంటిమైక్రోబియల్ (సూక్ష్మజీవి నిరోధక) ప్రొటీన్లు ఉంటాయి. ఇవి ఎన్నో ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి మనకు రక్షణను ఇస్తాయి. అయితే కొలోస్ట్రమ్ సప్లిమెంట్లను పాలంటే అలర్జీ ఉన్నవాళ్లు కొంచెం ఆలోచించి తీసుకోవాల్సి ఉంటుంది. పైగా వీటికి అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) నుంచి అనుమతులు కూడా రాలేదు. ఇక ఈ సప్లిమెంట్లు మోతాదు మించితే కడుపు ఉబ్బరం, డయేరియా లాంటి జీర్ణ సమ స్యలు తలెత్తుతాయి.

# టోకెన్ ఉంటేనే కొనుగోళ్లు..!

నల్గొండ:యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాప్తంగా 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వాటిల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం తనిఖీలు చేపడుతోంది. పర్యవేక్షణకు మండల స్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేశారు. అవకతవకల నివారణకు గతంలో మాదిరిగానే ఈసారి కూడా టోకెన్ల విధానం అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 10.42 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసి సన్న, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనడానికి కేంద్రాలు ఏర్పాటు చేశారు. టోకెన్ విధానం లేనప్పుడు కేంద్రం నిర్వాహకులు అవకతవకలకు పాల్పడేవారు. నగదు ముట్టజెప్పిన రైతుల ధాన్యాన్ని కాంటాలు వేశారు. మిల్లర్లు ఆ ధాన్యానికి కోత విధించేవారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఇతర గ్రామాల ధాన్యాన్ని, దళారుల సరకునూ ఆయా నిర్వాహకులు కొనుగోలు చేసేవారు. దీంతో కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతులు ఇబ్బందులు పడాల్సిన వచ్చేది. కొనుగోళ్లలో పెద్ద



ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు.అవకతవకలకు తావు లేకుండా సజావుగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ముందుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన సమయంలో నిర్వాహకులు రైతు పేరు, వివరాలు నమోదు చేసుకుంటారు. మండల వ్యవసాయ అధికారులు ధాన్యం తేమ శాతం పరిశీలిస్తారు. 17 శాతం తేమ వచ్చినసంబంధిత రైతుకు టోకెన్ అందిస్తారు. దాని ప్రకారం ధాన్యా న్ని బస్తాల్లో ఎప్పుడు నింపుతారు, మిల్లుకు ఎప్పుడు తరలిస్తారో.. చెబుతారు.

# నిఘా నేత్రాలకు మసక

కొత్తగూడెం :ఒక్క సీసీ (క్లోజ్డ్ సర్క్యూట్) కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానం'.. తరచూ సమీక్షలు, సమావేశాల్లో పోలీసు అధికారులు చెప్పేమాట ఇది. కానీ, చాలాచోట్ల నిఘా నేత్రాలు మసకబారుతున్నాయి. ముఖ్యంగా పట్టణాల్లోని కూడళ్లలో. భారీ వర్షాలతో పాటు వానరాల చేష్టలతో పలుచోట్ల సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయి. కేబుల్స్ వ్యవస్థ పనిచేయకుండా పోయింది. వాటిని పర్యవేక్షించే వ్యవస్థ సైతం సరిగా లేదు. ఫలితంగా నేర పరిశోధన, ఆధారాల సేకరణకు కూడా వీల్లేకుండా పోతోంది. ఓ వైపు కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజెప్పే అధికారులు.. ఇప్పుడు అందుబాటులో ఉన్నవాటి నిర్వహణను పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని ప్రధానమైన కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు పురపాలకాల్లో 'ఈనాడు-పరిశీలన' చేపట్టింది. అక్కడి పరిస్థితులు ఇలా ఉన్నాయి. ఇక్కడ మొత్తం 72 సీసీ కెమెరాలున్నాయి. చెరువుకట్ట ఏరియా, గోవింద్ సెంటర్, కొత్త బస్టాండ్, బుగ్గవాగు, పాతబస్టాండ్, జగదాంబ సెంటర్, సుభాష్‌నగర్ సహా అన్ని ప్రధాన కూళ్లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం పలు చోట్ల బాగానే పనిచేస్తున్నాయని అంచనా వేస్తున్నా.. ఇటీవల వర్షాల కారణంగా కేబుల్స్ దెబ్బతినడంతో 20కి పైగా మరమ్మతులకు గురైనట్లు పరిశీలనలో తేలింది. కాలనీలు, వ్యాపార సముదాయాల్లో నిఘా నేత్రాల ఏర్పాటు ఆవశ్యకతపై సీఐ సత్యనారాయణ 'మేముసైతం'లో భాగంగా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో నిఘా నేత్రాలు కీలకంగా మారాయి. ఒకటో పట్టణ ఠాణా పరిధిలో 38కి గాను 8, రెండో పట్టణ ఠాణా పరిధిలో 23కి 6, మూడో పట్టణ ఠాణా పరిధిలో 64కి గాను 21 వరకు పనిచేయడం లేదు. ప్రధాన వీధులు, కూడళ్లలో దాదాపు 60 వరకు సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో సుమారు 24 మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. మిగతా చోట్ల సాంకేతిక కారణాలు, వర్షాల కారణంగా మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాల్వంచ పట్టణ



పోలీసు అధికారులుపేర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన నాలుగింటిలో కేవలం రెండు సీసీ కెమెరాలే సరిగా పనిచేస్తున్నాయి. పోలీసు శాఖ స్వయంగా ఏర్పాటు చేసిన వాటిల్లో పలు నిఘా నేత్రాలు సాంకేతిక సమస్యలు, కేబుల్ వ్యవస్థ దెబ్బతిని సరిగా పనిచేయడం లేదు. వీటికి సత్వరం మరమ్మతులు చేయకపోతే నేర పరిశోధనకూ ఆటంకాలుగా తప్పేలా లేవు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం పట్టణం పోలీసులు యోచిస్తున్నట్లు సీసీ కెమెరాల వ్యవస్థ నిర్వహణను ఏదైనా ఏజెన్సీకి అప్పగించడం శ్రేయస్కరమనే అభిప్రాయం పురవాసుల్లో వ్యక్తమవుతోంది. కొత్తగూడెం పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల నిర్వహణకు సంబంధించి నిధులు కేటాయించాలని పురపాలక కమిషనర్‌ను ఇటీవల కోరాం. దీంతో వారు స్పందించి రూ.6 లక్షల నిధులు కేటాయిస్తామని చెప్పారు. దీంతో పాటు నిఘా నేత్రాల నిర్వహణ బాధ్యతలను గుర్తింపు పొందిన అధీకృత ఏజెన్సీకి అప్పగించాలనే యోచనలో ఉన్నాం. తద్వారా అవి నిరంతరం పనిచేసేలా చూస్తాం. 'మేముసైతం' కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యాన్ని సైతం కోరుతున్నాం. దుకాణ సముదాయాలు, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే భద్రత ఉంటుందనేది మా సూచన.

# పరికరాల కొరత.. సాగని విద్యుదీకరణ




నల్గొండ : దిమ్మె నిర్మించినా ఏర్పాటు చేయని విద్యుత్తు నియంత్రిక పెరుగుతున్న విద్యుత్తు సర్వీసులకు అనుగుణంగా చేపడుతున్న విద్యుదీకరణ పనులకు బ్రేకులు పడుతున్నాయి. సంస్థలో పరికరాల కొరత వేధిస్తోంది. వానాకాలం పంటల నూర్పిడి పూర్తి కానుండటంతో నిలిచిన, కొత్తగా చేపట్టాల్సిన పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు ముందుకు వస్తున్నా.. విద్యుదీకరణ పనులకు కావాల్సిన ప్రధాన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారా నియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. రైతులు విద్యుత్తు నియంత్రికల కోసం డీడీలు చెల్లించినా.. మంజూరైన స్తంభాలు, తీగ, ఏబీ స్విచ్‌లు, హెడ్జ్ ఫ్యూజుల కాసారాలు, క్లాంపులు వంటి సామగ్రి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం అధికారులు అందించలేకపోతున్నారు. నియంత్రికల వద్ద కరెంటు సరఫరాను నియంత్రించడంలో కీలకమైన ఏబీ స్విచ్‌ల కొరత ఎప్పటి నుంచో వేధిస్తోం ది. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే విద్యుత్తు ఉపకేంద్రాల్లో కరెంటు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారానియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ నియంత్రికల కొరతతో పనుల్లో జాప్యం నెలకొంటుంది. దేవరకొండ, నల్గొండ, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టాల్సి ఉండగా.. పరికరాల కొరతతో అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నల్గొండ, యాదాద్రి భువనగిరి సర్కిళ్ల పరిధిలో సుమారు 1050కి పైగా విద్యుత్తు నియంత్రికలు, 1125కిపైగా ఏబీ స్విచ్‌ల కొరత నెలకొంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా విద్యుత్తు శాఖలపై సమీక్ష నిర్వహించారు.


# అలంకారప్రాయంగా బస్తీ దవాఖానా?

వేములవాడ:పేద ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా అలంకారప్రాయంగా మారింది. వేములవాడలోని రాజన్న దర్శనానికి వచ్చే భక్తులతో పాటు జాత్రగౌండ్ ప్రాంతంలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏడాదిన్నర క్రితం ఆలయ లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో దీనిని ఏర్పాటు చేశారు. అన్ని వసతులు కల్పించి రెండు పడకలతో ప్రారంభించారు. ఇందులో ఒక వైద్యుడు, స్టాఫ్‌నర్స్, హెల్పర్‌ను నియమించారు. ఆసుపత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి నామమాత్రంగానే రోగులు వస్తున్నారు. స్థానికులు మాత్రం రక్తపోటు, మధుమేహం, దగ్గు వంటి వాటికి మందుల కోసం వస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులే తక్కువగా ఉంటే మందులు కూడా అరకొరగానే సరఫరా అవుతున్నాయి. మందుల కోసం ఇండెంట్ పెట్టినప్పటికీ ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది.

ఒక వేళ వచ్చినా పూర్తి స్థాయిలో రావడం లేదు. ఆరు నెలల నుంచి




అరకొరగానే మందులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఆసుపత్రి ముందు భక్తులు, ఇతరులు వాహనాలు నిలుపుతున్నారు. దీనికి ఇరువైపులా రహదారులను ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వారంలో ఈ రోజుల్లోనే... వారంలో శనివారం ఆసుపత్రికి సెలవు.



# థ్రాంబెక్టమీతో.. స్ట్రోక్‌కు చెక్

పక్షవాతం (స్ట్రోక్) చికిత్సను 2014వ సంవత్సరం కొత్తపుంతలు తొక్కించింది. ఆ ఏడాది అధునాతనమైన చికిత్సా పద్ధతి అందుబాటులోకి వచ్చింది. అదే.. థ్రాంబెక్టమీ. జనరల్ అనెస్తీషియా అవసరం లేని సర్జరీ ఇది. కేవలం లోకల్ అనెస్తీషియాతో స్ట్రోక్ వచ్చిన 24 గంటల్లోగా థ్రాంబెక్టమీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పక్షవాతంతో పోలిస్తే గుండెపోటు నుంచి బయటపడటం చాలా సులువు. గుండె ఎక్కడ ఉంటుందో గుండెపోటు లక్షణాలు కూడా అక్కడే ఉంటాయి. కానీ మెదడులో సమస్య వల్ల తలెత్తే పక్షవాతం లక్షణాలు ఏ కాళ్లూ చేతుల్లోనో కనిపిస్తాయి. అందుకే దీన్ని తొందరగా గుర్తించలేకపోతారు. అంతేకాదు.. గుండెపోటుకు ఒక్క ఈసీజీ చూసి చికిత్సకు సిద్ధం కావొచ్చు. పక్షవాతానికి మాత్రం సీటీ ఆంజియోగ్రామ్, సీటీ స్కాన్ లేదా ఎంఆర్ఐ ఆంజియోగ్రామ్, ఎంఆర్ఐ స్కాన్లు చేస్తారు. వీటిద్వారా వచ్చింది ఏ రకమైన పక్షవాతమో తెలియడం మాత్రమే కాకుండా, నాడీ కణజాలం ఎంతమేరకు ప్రభావితం అయ్యిందనే విషయం కూడా నిర్ధారణ అవుతుంది. ఇలా వైద్యులు సమస్యను పూర్తిగా గుర్తించి, తగిన చికిత్స చేస్తారు.

శరీరంలో కణాలన్నీ ఆరోగ్యంగా ఉండాలంటే కణ కణానికీ నిరంతరం రక్తం సరఫరా కావాలి. మెదడులోని కణాలు కూడా అంతే. ఏ కారణం చేతనైనా మెదడుకు తగినంత రక్తం అందకపోతే ఆయా కణాలు దెబ్బతిని చనిపోతాయి. ఇలా రక్తం అందకపోవడానికి ప్రధానంగా రెండు రకాల కారణాలున్నాయి. మొదటిది ఇస్కిమిక్ స్ట్రోక్. అంటే%ొ% మెదడుకు మొత్తం నాలుగు రక్తనాళాలు వెళ్తాయి. ఇందులో రెండు రక్తనాళాలు మెదడు ఎడమవైపుకి, రెండు కుడివైపుకి వెళ్తాయి. వీటిలో ఎక్కడైనా రక్తం గడ్డకడితే అది రక్త ప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది. దాంతో మెదడుకు రక్తసరఫరా సరిగా జరగక పక్షవాతం వస్తుంది. దాదాపు 80 శాతం స్ట్రోక్ కేసులకు ఇదే కారణం. ఇక రెండో రకం హెమరేజిక్ స్ట్రోక్. ఈ రకం దానిలో రక్తనాళాల్లో ఏదైనా చిట్లిపోయి, రక్తం బయటికి రావడంతో మెదడులో కణాలు దెబ్బతింటాయి. ఇలాంటప్పుడు వచ్చే పక్షవాతం ఇది. దాదాపు 20 శాతం పక్షవాతం కేసులకు కారణం హెమరేజిక్ స్ట్రోక్.

ఎందుకు వస్తుంది?: పక్షవాతం రావడానికి ప్రధాన కారణం అధిక రక్తపోటు. మధుమేహం కూడా కారణమవుతుంది. బీపీ, మధుమేహం ఇంతకుముందైతే అరవయ్యేండ్ల వయసులో కనిపించేవి. కానీ ఇప్పుడు ముప్పైల్లోనే దాపురిస్తున్నాయి. అందుకే ఈ వయసు వాళ్లలో కూడా పక్షవాతం కనిపిస్తున్నది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకుండా జంక్‌ఫుడ్‌కు తినడం, ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌కు ఇప్పటి యువత అలవాటు పడుతున్నది. ఇవన్నీ కూడా పక్షవాతానికి కారణమయ్యేవే. మరో ముఖ్య కారణం అధిక ఒత్తిడి. కార్పొరేట్ ఉద్యోగాలు పెరిగిన తర్వాత చిన్న వయసులోనే అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దాంతో నలభై ఏండ్లు దాటకుండానే పక్షవాతానికి గురవుతున్నారు. ఇలాంటి జీవనశైలి కారణాలతోపాటు జన్యుపరమైన అంశాలు కూడా పక్షవాతం రావడానికి దోహదపడతాయి.

పక్షవాతానికి మరో కారణం డైసెక్షన్. దీనిలో రక్తనాళంలోని రెండు పొరలు విచ్చుకుంటాయి. సాధారణంగా రక్తనాళంలో 3 పొరలు ఉంటాయి. వీటిలో మొదటి రెండు పొరలు తెరుచుకుని అందులోకి రక్తం వెళ్తుంది. దానివల్ల పక్షవాతం వస్తుంది. ఎక్కువగా మసాజ్ చేయించుకోవడం, లాంగ్ డ్రైవ్ చేయడం, డ్రైవ్ చేస్తూ మెడ వెనక్కి తిప్పడం వల్ల రక్తనాళాలు మెలితిరిగిపోయి ఇలాంటి సమస్య రావొచ్చు. చిన్నారుల్లో గుండెజబ్బుల వల్ల పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువ. ఆ తర్వాత సికిల్‌సెల్ ఎనీమియా, మోయా-మోయా అనే వ్యాధి (దీనిలో రక్తనాళాలు సన్నగా అవుతాయి) లాంటివి చిన్నపిల్లల్లో పక్షవాతానికి కారణమవుతాయి.

ఏం జరుగుతుంది?: మెదడులో నాడీ కణజాలానికి రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడినప్పుడు ఆ కణాలకు పోషకాలు, ఆక్సిజన్ అందక అక్కడి కణాలు నశిస్తాయి. ఇలాంటప్పుడు ఏ నాడీ కణజాలం మన శరీరంలో ఏ పనిని నిర్వర్తిస్తుందో%ొ% ఆ కణజాలం దెబ్బతినడం వల్ల ఆయా పనులు చేయలేకపోతాం. ఉదాహరణకు కాలు, చెయ్యి కదలికలను నియంత్రించే నాడీ కణజాలానికి రక్తం అందక అది చచ్చుబడిపోతే ఇక కాలు, చెయ్యి కదిలించలేం. మాటకు సంబంధించిన నాడీ కణజాలం దెబ్బతింటే మాట పడిపోవడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం లాంటి సమస్యలు వస్తాయి.

సమయం.. అత్యంత కీలకం!: నాడీకణాలు ఒకసారి చచ్చిపోతే ఇక కొత్త నాడీకణాలు ఏర్పడవు. కాబట్టి అవి నశించిపోకుండా చూసుకోవాలి. పక్షవాతం వచ్చినప్పుడు రక్త సరఫరా ఆగిపోయిన చోట ఉన్న కొన్ని కణాలు వెంటనే దెబ్బతింటాయి. నిమిష నిమిషానికీ ఇలా దెబ్బతినే కణాల సంఖ్య పెరుగుతూ పోతుంది. ఒక నిమిషానికి ఏడు వందల కోట్ల (7 బిలియన్ల) న్యూరాన్లు చనిపోతాయి. అందుకే పక్షవాతం వచ్చినప్పుడు ప్రతీ నిమిషం కీలకమైనదే. బ్లాక్ దగ్గర ఉన్న కణాల చుట్టూ కొంతమేర ఉండే కణజాలాన్ని పెనెంబ్రా అంటారు. దీన్ని రిస్క్‌లో ఉన్న కణజాలంగా పరిగణిస్తారు. ఈ కణజాలం ఎంత ఎక్కువ భాగం డ్యామేజి అయితే అంత ఎక్కువ నష్టం ఉంటుంది. సమయం మించిపోతున్న కొద్దీ ఫలితం వేరుగా ఉంటుంది. రిస్క్ కణజాలం మొత్తం డ్యామేజీ అయ్యిందంటే ఇక ఏ చికిత్సా అందించలేం. అందుకే పక్షవాతం వచ్చినప్పుడు రోగిని ఎంత తొందరగా హాస్పిటల్‌లో చేరిస్తే అంత మంచిది.

మొబైల్ స్ట్రోక్ యూనిట్స్: చాలా దేశాల్లో పక్షవాతానికి త్వరగా చికిత్స అందించడానికి ప్రత్యేకమైన అంబులెన్స్ యూనిట్లు ఉంటాయి. వీటిని మొబైల్ స్ట్రోక్ యూనిట్స్ అంటారు. ఈ అంబులెన్స్‌లోనే సీటీ స్కాన్, డాక్టర్, నర్సు అందరూ ఉంటారు. రోగి దగ్గరికి వెళ్లగానే అదే అంబులెన్సులో సీటీ స్కాన్ చేసి, అక్కడే ఇంజెక్షన్ ఇస్తారు. ఇలాంటి యూనిట్లను హైదరాబాద్‌లో కూడా ప్రారంభించే ఆలోచన ఉంది. అయితే మన దగ్గరి మొబైల్ స్ట్రోక్ యూనిట్లో సీటీ స్కాన్‌ను ఉంచలేం. అందువల్ల రోగిని సీటీ స్కాన్ చేయించుకోమని, ఆ రిపోర్ట్స్ వాట్సాప్‌లో పంపించమని వైద్యులు సూచిస్తారు. ఈలోపు అంబులెన్స్ పేషెంట్ దగ్గరికి చేరుకుంటుంది. అక్కడే వెంటనే ఇంజెక్షన్ చేసి రోగిని హాస్పిటల్‌కు తరలిస్తారు. పైగా రోగి హాస్పిటల్ దాకా వచ్చే సమయం మిగిలిపోతుంది కూడా!

ఎలా గుర్తించాలి?: మాటలో తేడా రావడం, నత్తి, సరిగ్గా మాట్లాడలేకపోవడం, విన్నది అర్థం చేసుకోలేకపోవడం, మూతి పక్కకు వెళ్లిపోవడం (ఫేషియల్ పెరాలిసిస్), ఒకవైపు చెయ్యి, కాలు బలహీనం కావడం, ఒక కాలు లేదా ఒక చెయ్యి బలహీనం కావడం, నడిస్తే అడుగులు తడబడటం, మనుషులు ఒక్కరే ఇద్దరుగా కనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సీటీ స్కాన్ చేయించాలి. పక్షవాతం నిర్ధారణ జరిగితే చికిత్స మొదలుపెట్టాలి.


చికిత్సతో బాగవుతుందా?: పక్షవాతానికి ఒకప్పుడు చికిత్స లేదు. కానీ గత 15 20 ఏండ్లుగా మంచి చికిత్స అందుబాటులో ఉన్నది. లక్షణాలు కనిపించిన మొదటి నాలుగున్నర గంటలలోగా హాస్పిటల్‌లో చేరాలి. వెంటనే తగిన చికిత్స తీసుకుంటే శరీరంలో ఎలాంటి అవకరా లు ఏర్పడకుండా ఉంటాయి. రోగిని హాస్పిటల్‌లో చేర్చగానే వైద్యులు సీటీ స్కాన్ చేస్తారు. ఇందులో రక్తనాళం చిట్లి రక్తస్రావం కావడం వల్ల పక్షవాతం వచ్చిందా, లేదా బ్లాక్ వల్ల వచ్చిందా అనేది తెలుస్తుంది. రక్తస్రావం వల్ల కాకుండా బ్లాక్ వల్ల వచ్చిన ఇస్కిమిక్ స్ట్రోక్ అయితే వెంటనే క్లాట్ కరగడానికి ఒక ఇంజెక్షన్ ఇస్తారు. ఇది టిష్యూ ప్లాస్మోజెన్ యాక్టివేటర్ (టిపిఎ)లేదా టెనెక్టిప్లేస్ ఇంజెక్షన్. ఇలా ఇంజెక్షన్ ఇవ్వడాన్ని థ్రాంబోలైటిక్ థెరపీ అంటారు. ఈ ఇంజెక్షన్ వల్ల రక్త సరఫరాకు ఆటంకంగా ఉన్న గడ్డ కరిగిపోయి రక్తనాళం తెరుచుకుం టుంది. దాంతో రక్త సరఫరా సాఫీగా జరుగుతుంది. ఫలితంగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నాడీ కణాలకు ఆక్సిజన్ అంది, అవి మెరుగుపడ తాయి. ఇంజెక్షన్ ఇచ్చినప్పటికీ రక్తనాళంలో గడ్డ కరగకుండా రక్తనాళం తెరుచుకోకపోతే, మెకానికల్ థ్రాంబెక్టమీ చేస్తారు. అంటే ఎండోవాస్కు లర్ థెరపీ ద్వారా కేథటర్ పంపి, క్లాట్ తీసేస్తారు. ఇది 6 గంటలలోపు చేయాలి. కొందరిలో 24 గంటల లోపు కూడా చేయవచ్చు. పక్షవాతం నుంచి కోలుకోవడానికి ఫిజియోథెరపీ అత్యంత ముఖ్యమైన చికిత్స. ఫిజియోథెరపీలో స్ట్రెంథెనింగ్ వ్యాయామాలు చేయిస్తారు. కండరాల్లో స్టిఫ్‌నెస్ పోవడానికి ఇంజెక్షన్లు ఇస్తారు. వాకింగ్ చేయిస్తారు. ఇలాంటి వాటివల్ల పక్షవాతానికి గురైన అవయవాలు తిరిగి శక్తి పుంజుకుంటాయి. వాటి పనితీరు మెరుగుపడుతుంది. థ్రాంబోలైటిక్ థెరపీ ఇంజెక్షన్లు జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంటే చికిత్స అక్కడికక్కడే వెంటనే ఇవ్వొచ్చు. అలా హైదరాబాద్ వరకూ వచ్చే టైం మిగులుతుంది. రోగి కోలుకునే అవకాశాలు పెరుగుతాయి.

సర్జరీ ఏంటి?: సాధారణంగా పక్షవాతం (స్ట్రోక్) వస్తే ప్రతి పదిమందిలో నలుగురికి ఇంజెక్షన్ అవసరమైతే, ఇద్దరికి సర్జరీ అవసరం అవుతుంది. అయితే, సర్జరీ అనగానే ఇదేదో పెద్ద కోతపెట్టి చేసే ఆపరేషన్ అని భయపడనక్కర్లేదు. కాలి రక్తనాళం ద్వారా కేథటర్ గుండా స్టెంట్ రిట్రీవర్ అనే పరికరాన్ని క్లాట్ దగ్గరికి పంపించి, దాన్ని తొలగిస్తారు. దీన్ని థ్రాంబెక్టమీ అంటారు. రోగి తొడ భాగంలో చిన్న కోత పెట్టి ఆప్టిక్ ఫైబర్ కేబుల్‌ను రక్తనాళం గుండా మెదడులో మూసుకుపోయిన రక్తనాళంలోకి పంపిస్తారు. తర్వాత సున్నితమైన గొడుగు లాంటి స్టెంట్ రిట్రీవర్‌ను కేథటర్ గుండా పంపిస్తారు. మెదడు రక్తనాళంలో పూడిక ఉన్న చోట స్టెంట్ రిట్రీవర్ గొడుగు లాగా తెరుచుకుని అక్కడ అడ్డంగా ఉన్న గడ్డను తనలోకి లాగేసుకుంటుంది. అప్పుడు దాన్ని బయటికి లాగేస్తారు. రక్తనాళంలో ఏర్పడ్డ గడ్డ తొలగిపోవడంతో రక్త ప్రసరణ సాఫీగా కొనసాగుతుంది.

సర్జరీ.. ఎప్పుడు?: రక్తనాళంలో చిన్న చిన్న గడ్డలు లేదా క్లాట్స్ ఏర్పడినప్పుడు చేతికి ఇంజెక్షన్ ఇస్తే అవి కరిగిపోతాయి. కానీ రక్తనాళంలో ఏర్పడే పెద్ద పెద్ద క్లాట్స్‌ను కరిగించాలంటే ఈ థ్రాంబోలైటిక్ థెరపీ ఇంజెక్షన్‌తోపాటు సర్జరీ కూడా అవసరం అవుతుంది. పక్షవాతం వచ్చిన నాలుగున్నర గంటల తర్వాత హాస్పిటల్‌కు తీసుకువచ్చినా సర్జరీ తప్పనిసరి. ఇంజెక్షన్ ఇవ్వలేని పరిస్థితులు ఉన్నవాళ్లకు కూడా సర్జరీ అవసరం ఏర్పడుతుంది. అంటే థ్రాంబోలైటిక్ ఏజెంట్స్ లాంటి మందులు తీసుకున్నవాళ్లు, అంతకు ముందు నెలలోపు సర్జరీ అయినవాళ్లు, ఇటీవలే స్ట్రోక్ వచ్చినవాళ్లకు థ్రాంబోలైటిక్ థెరపీ చేయలేం. ఇలాంటివాళ్లకు థ్రాంబెక్టమీ సర్జరీ చేస్తారు. సాధారణంగా స్ట్రోక్ వచ్చిన నాలుగున్నర గంటల్లోగా థ్రాంబోలైటిక్ థెరపీ తీసుకోవాలి. ఏ కారణం చేతనైనా హాస్పిటల్‌కు రావడం ఆలస్యం అయినవాళ్లకు ఈ థ్రాంబెక్టమీ మరో దారి చూపి స్తుంది. ఈ సర్జరీని పక్షవాతం వచ్చిన 24 గంటల్లోగా చేయవచ్చు. ఒకసారి చేసిన తర్వాత కూడా ఈ సర్జరీని ఎన్నిసార్లయినా చేయొచ్చు. సర్జరీ తర్వాత పక్షవాత రోగుల్లో 5 నుంచి 20 శాతం మందిలో మెదడులో వాపు రావొచ్చు. వారికి ఓపెన్ సర్జరీ అవసరం పడొచ్చు.

పక్షవాతంతో ఇక భయం లేదు!: ఎంత చెట్టుకు అంత గాలి.. ఇది ఒకప్పటి సామెత. ఎన్ని చెడ్డ అలవాట్లుంటే అన్ని రోగాలు.. ఇది ఇప్పటి మాట. మారిన ఆహార పద్ధతులు, చిన్న వయసులోనే దుర్వ్యసనాల బారినపడటం.. వెరసి ఎప్పుడో 60 ఏండ్లు దాటాక వచ్చే జబ్బులు ఇప్పుడు పాతికేండ్లకే వచ్చిపడుతున్నాయి. అలాంటి వ్యాధుల సరసన పోటీ పడుతున్న జబ్బుల్లో పక్షవాతం ఒకటి. చిన్నవయసులోనే పక్షవాతం బారినపడుతున్న వాళ్ల సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు, అంగవికలత్వానికి పక్షవాతం రెండో కారణంగా మారింది. అలాగని పక్షవాతం బారినపడ్డామని కుంగిపోనవసరం లేదు. త్వరగా హాస్పిటల్‌లో చేరితే పక్షవాతం వచ్చినా కూడా ఎప్పట్లా జీవించే వీలుంది. పక్షవాతం లక్షణాలు, చికిత్సల గురించి అవగాహన పెంచుకుని సకాలంలో గుర్తించి, చికిత్స తీసుకోవాలి.


# 2030 నాటికి మనిషిని మించిన మేధస్సు..



## మానవాళినే నాశనం చేయనున్న ఏఐ! 'గూగుల్ డీప్‌మైండ్' అంచనా

న్యూఢిల్లీ, : ఆధునిక సాంకేతికతల్లో ఒకటైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా పురోగమిస్తున్నది. భవిష్యత్తులో ఈ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి మనుగడకే ప్రమాదకరంగా మారుతుందన్న భయాందోళనలు చాలా కాలం నుంచి వినిపిస్తున్నాయి. ఆ రోజులు త్వరలోనే రాబోతున్నట్టు తాజా పరిశోధనలో తేలింది. 2030 నాటికి ఏఐ మరింత అభివృద్ధి చెందుతుందని, మానవులతో సమానమైన తెలివితేటలు కలిగిన కృత్రిమ మేధస్సుగా పిలిచే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)గా రూపాంతరం చెంది మానవాళిని శాశ్వతంగా నాశనం చేస్తుందని 'గూగుల్ డీప్‌మైండ్' తన పరిశోధనా పత్రంలో పేర్కొంది. అయితే ఈ ముప్పు ఎలాంటిదో, మానవాళి మనుగడకు ముప్పుఎలా వస్తుందో వెల్లడించలేదు. ఏజీఐ వల్ల ఎదురయ్యే ప్రమాదాలను ఈ అధ్యయనం 4 ప్రధాన క్యాటగిరీలుగా విభజించింది. ఏజీఐతో సమాచార దుర్వినియోగం (డాటా మిస్ యూజ్), మిస్ అలైన్‌మెంట్, మిస్టేక్స్, స్ట్రక్చరల్ రిస్కు లాంటి ప్రమాదాలు ఉన్నాయని ఈ పరిశోధనా పత్రం సహ రచయిత, 'డీప్‌మైండ్' సహ వ్యవస్థాపకుడు షేన్ లెగ్ స్పష్టం చేశారు. ఈ ప్రమాదాలను తగ్గించేందుకు గూగుల్, ఇతర ఏఐ కంపెనీలు తగిన నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. కృత్రిమ మేధస్సును నియంత్రణలో ఉంచడంపైనే ఈ పరిశోధనలో దృష్టి కేంద్రీకరించామని, దాని వల్ల ఎదురయ్యే ముప్పుపై లోతుగా అధ్యయనం చేశామని చెప్పారు. కాగా, మనుషుల కంటే ఎక్కువ తెలివితేటలు కలిగిన ఏజీఐ రాబోతున్నదని, వచ్చే 5 నుంచి 10 ఏండ్లలో దీని ఆవిర్భావం ప్రారంభం కావచ్చని 'డీప్‌మైండ్' సీఈవో డెమిస్ హస్సాబిస్ రెండు నెలల క్రితమే స్పష్టం చేశారు. ఏజీఐ అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన ఉద్ఘాటించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐకి మరో ముందడుగే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్. ఏఐ అనేది టాస్క్ స్పెసిఫిక్‌గా ఉంటుంది. అంటే మనం ఇచ్చిన పనులను మాత్రమే చేయగలుగుతుంది. కానీ, ఏజీఐ అనేది మానవ మేధస్సు మాదిరిగా అనేక రకాల పనుల నిర్వహణకు అవసరమైన తెలివితేటలను కలిగి ఉండేలా లక్ష్యాలను పెట్టుకుంటుంది.

# తరచూ రక్త విరేచనాలు అవుతున్నాయి



మా బాబుకు పద్నాలుగు ఏండ్లు. ఆరు నెలల నుంచి తరచుగా విరేచనాలు అవుతున్నాయి. విరేచనం కొద్దికొద్దిగా అయ్యింది. కొన్నిసార్లు రక్తం కూడా పడింది. డాక్టర్ దగ్గరకు వెళ్తే మందులు ఇచ్చారు. వాటిని వాడినప్పుడు తగ్గడం.. కొన్నాళ్లకు మళ్లీ విరేచనాలు అవ్వడం సాధారణమై పోయింది. ఈ ఆరు నెలల్లో బరువు తగ్గాడు. ఎప్పుడూ నీరసంగా ఉంటున్నాడు. పరిష్కారం ఏంటి?

పిల్లలకు అప్పుడప్పుడూ విరేచనాలు కావడం సాధారణమే. వైరస్ ఇన్ఫెక్షన్ వల్ల అలా జరుగుతుంది. అప్పుడప్పుడూ నీళ్ల విరేచనాలు కూడా అవుతాయి. కొన్నిసార్లు వాంతులతో మొదలవుతాయి. కొన్నిరోజులకు తగ్గుతాయి. తగ్గకపోతే లక్షణాన్ని బటి వైద్యం చేయించాల్సి ఉంటుంది. ఓఆర్ఎస్ నీళ్లు తాగడం, ప్రో బ్యాక్టీరియా పదార్థాలు తినడం వల్ల సాధారణ విరేచనాలు తగ్గుతాయి. కానీ ఆరు నెలల నుంచి పదే పదే విరేచనాలు అవ్వడం, రక్తం పడటం, బరువు తగ్గడం, నీరసంగా ఉండటం మంచి లక్షణాలు కావు. దీనికి ఏదైనా బలమైన కారణం ఉందేమో తెలుసుకోవాలి. ఇన్‌ఫ్లమేటరీ బవల్ సిండ్రోమ్ అనే పేగు సంబంధమైన సమస్యలు ఉంటే ఇలాగే అవుతుంది. దానిని క్రాన్స్ డిసీజ్ అంటారు. ఇది పిల్లలకే కాదు పెద్దలకూ వస్తుంది. పేగుల్లో రియాక్షన్ వల్ల ఇన్‌ఫ్లమేషన్ కలుగుతుంది. ఆహారం జీర్ణం కాకపోవడం, రక్తం పోవడం వల్ల రక్తహీనత బారినపడతారు. అందువల్ల నీరసంగా ఉంటారు. మీ ఇంట్లో ఇలాంటి లక్షణాలతో ఎవరైనా ఉన్నారా? అన్నది రాయలేదు. బహుశా లేకపోవచ్చేమో! పిల్లల వైద్యులను.. అలాగే గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ని సంప్రదించి తీవ్రమైన, దీర్ఘకాల వ్యాధి కాదని నిర్ధారించుకోవాలి. ఒకవేళ ఇది ఇన్‌ఫ్లమేటరీ బవల్ సిండ్రోమ్ అయితే దానికి చికిత్స ఉంది. ప్రత్యేకమైన మందులు వాడుతూ, కొన్ని ఆహార నియమాలు పాటిస్తే తగ్గుతుంది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా పీడియాట్రీషియన్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ని కలవండి.

# పెట్రోలు, డీజిల్ ధరలను రూ.2 లు తగ్గించాలి : సిపిఐ(యం)




విజయవాడ : పెట్రోలు, డీజిల్ ధరలను రూ.2 లు తగ్గించాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. పెట్రోలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి అంతర్జాతీయ ముడి చమురు ధరలకనుగుణంగా ధరలను తగ్గించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. రూ.2 లు అదనపు సుంకాన్ని విధించినా ధర పెంచలేదంటూ ప్రజ లను మభ్యపరిచి, మోసపుచ్చటాన్ని సిపిఐ(ఎం) నిరసిస్తున్నదన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయనీ, అందుకనుగుణంగా ఇక్కడ కూడా పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారాన్ని తగ్గించాల్సింది పోయి ఎక్సైజ్ సుంకాన్ని పెంచి కేంద్ర ప్రభుత్వం తన ఖజానాలో వేసుకోవడం గర్హనీయమ న్నారు. పైగా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచలేదని ప్రచారం చేసుకోవడం ప్రజలను మభ్యపరచడమేనన్నారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచి, తగ్గినప్పుడు ధర తగ్గించకపోవడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే లీటరు రూ.2.లు చొప్పున తగ్గించాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నదని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# పిల్లల తెలివికి కాలుష్యం కాటు



పిల్లలు తమ బాల్యం తొలి సంవత్సరాల్లో ఎక్కువ మోతాదులో కాలుష్యానికి గురవుతే మెదడులో ఆలోచన, శరీర నియంత్రణకు సంబంధించిన భాగాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందట. ఎన్విరాన్‌మెంట్ ఇంటర్నేషనల్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఓ పరిశోధన ఈ విషయం వెల్లడించింది. వాయు కాలుష్యం పిల్లల మెదడు అభివృద్ధికి ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించింది. స్పెయిన్ దేశానికి చెందిన బార్సెలోనా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ఆధ్వర్యంలో ఈ పరిశోధన జరిగింది. పరిశోధన కోసం 3,626 మంది పిల్లల నుంచి సమాచారం సేకరించారు. వీళ్లంతా పార్టిక్యులేట్ మ్యాటర్ 2.5, పార్టిక్యులేట్ మ్యాటర్ 10, నైట్రోజన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల కాలుష్యం బారినపడిన ప్రాంతాల్లో నివసించేవాళ్లే. పుట్టినప్పటి నుంచి మూడేండ్ల వరకు వాయు కాలుష్యం బారినపడితే శరీర కదలికలు, వినికిడికి సంబంధించిన మెదడు భాగాల్లో నాడుల మధ్య అనుసంధానం తక్కువగా ఉంటుందని ఈ పరిశోధన ఫలితాలు వెల్లడించాయి. అయితే, ఈ ఫలితాలను కచ్చితంగా నిర్ధారించడానికి మరింత అధ్యయనం అవసరమని పరిశోధకులు తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# నాన్న వద్దనుకున్న బిడ్డని..





ఆడపిల్లలు తల్లిదండ్రులకు భారమని ఆ తండ్రి భావించాడు. తనకే ఆడపిల్ల పుట్టేసరికి తట్టుకోలేక పోయాడు. ఆ పిల్లపై ద్వేషం పెంచుకున్నాడు. తల్లి లేని వేళ చూసి, పొత్తిళ్ల బిడ్డని, కనీసం నెల రోజులు కూడా పూర్తవ్వని పసిదాన్ని నిర్దాక్షిణ్యంగా కిటికీలోంచి విసిరేశాడు. కిందపడిపోతున్న ఆ బిడ్డని అక్కడే తచ్చాడుతున్న పక్కింటితను కాపాడాడు. అతడు లేకపోయుంటే ఆ బిడ్డ ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి. ఎంత దుర్మార్గం? గుక్కపెట్టి ఏడుస్తున్న ఆ బిడ్డని తల్లి పొత్తిళ్లలోకి తీసుకుంది. గుండెలవిసేలా ఏడుస్తున్న బిడ్డని ఓదార్చడం ఆ అమ్మ తరం కాలేదు. ఆ క్షణం ఆ అమ్మ తీసుకున్న నిర్ణయం.. ఇప్పుడు ఆ పిల్ల సంగీత ప్రపంచంలో రికార్డులు బద్దలు కొట్టేలా చేస్తోంది.

**ఇది ఢిల్లీకి చెందిన 13 ఏళ్ల నియతి చెత్రాన్ష్ నిజమైన కథ!**

'నాన్న వద్దనుకున్న బిడ్డని నేను. అమ్మే నా రోల్ మోడల్' అంటూ నియతి ఎక్కడ సంగీత ప్రదర్శన చేసినా ముందుమాటగా చెబుతుంది. తండ్రి చేసిన దారుణం ఆ బిడ్డ మనసుని ఎంతలా బాధించిందో ఈ ఒక్క ఉదాహరణ చాలు.. నియతి గురించి వాళ్ల అమ్మ మాటల్లో చెప్పాలంటే.. 'నా కూతురు ఓ అద్భుతం.. వాళ్ల నాన్నకి అక్కర్లేదని విసిరేసిన రోజేనేను ఒక నిర్ణయం తీసుకున్నాను. నేను ఈ ప్రపంచాన్ని మార్చలేకపోవచ్చు. కానీ అతను విసిరేసిన ఈ బిడ్డ ప్రపంచాన్ని మార్చేలా తయారుచేస్తాను' అంటూ అతని నుండి బయటికి వచ్చేసి, ఒంటరిగానే నా చిట్టితల్లిని పెంచాను' అని చెబుతున్నారు.

సంగీతంపై నియతి పెంచుకున్న మక్కువ గురించి కూడా ఆమె ఇలా చెప్పారు. 'ఆరు నెలల వయసున్నప్పుడు నేను తనకి ఒక కీబోర్డ్ కొనిచ్చాను. అంత పసిపిల్లగా ఉన్నప్పుడే తను చాలా సహజమైన పద్ధతిలో లయబద్ధంగా ప్లే చేసేది. ఆ తరువాత వంటగది పాత్రలపై కూడా సంగీతాన్ని పలికించేది. అప్పుడే నా బంగారుతల్లి ప్రతిభని గుర్తించాను. సంగీత సాధనలో తను ఎంత దూరం వెళ్లాలనుకుంటే అంత దూరం తనని తీసుకెళ్లాలనుకున్నాను' అంటున్నప్పుడు ఆమె కళ్లు కన్నీటి సంద్రాలయ్యాయి.

అమ్మ గురించి నియతి చెబుతూ.. 'తను నా కోసం ఉద్యోగాన్ని వదులుకుంది. ఫ్రీలాన్సర్‌గా స్థిరపడి వచ్చిన ఆదాయంతోనే ఇద్దరం జీవిస్తున్నాం. చిన్నప్పటి నుండి నాకు సంగీతంపై ఇష్టం వుండేది. అమ్మ నా ఇష్టాన్ని ఎప్పుడూ కాదనలేదు. నేను కన్న కలలు సాకారం చేసేందుకు అమ్మ ఎన్నో త్యాగాలు చేసింది. అందుకే అమ్మ నా రోల్‌మోడల్' అని గర్వంగా చెబుతుంది.

నియతి సంగీత సాధనలో ఎంతో నైపుణ్యం సాధించింది. 12 ఏళ్లకే 42 సంగీత పరికరాలపై స్వరాలు పలికించేది. ఆ ప్రతిభ అక్కడితోనే ఆగలేదు. పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గొప్ప గొప్ప ప్రదర్శనలు చేసి ఔరా అనిపించు కుంది. 65 సెకండ్లలో 15 సంగీత వాయిద్యాలపై జాతీయగీతాన్ని స్వరపర్చి ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుంది. బ్లైండ్‌ఫోల్డ్‌తో ఎంతో క్లిష్టమైన శివతాండవ్‌ని కేవలం 13 సెకన్ల వ్యవధిలో ప్రదర్శించి ప్రేక్షకులను ఆశ్చర్యంలో ముంచెత్తింది.

సంగీతంలో రికార్డులు సృష్టిస్తున్న నియతిని ఎప్పుడైనా ఎవరైనా ప్రశంసిస్తే.. తను అన్న మాటలివి.. 'ఈ రికార్డులు కేవలం సంగీతంలో మాత్రమే కాదు.. నన్ను ఎవరూ నిశ్శబ్దం చేయలేరని నిరూపించడానికి, అలాగే నాలాంటి బిడ్డలని తయారుచేస్తున్న అమ్మలను ఎవరూ ఆపలేరని చెప్పడానికి' అని నియతి ఎంతో గర్వంగా చెబుతుంది.

## ఇండస్ట్రీలోకి రావడానికి తెలుగు అమ్మాయిలు భయపడుతున్నారు: వైష్ణవి



షార్ట్ ఫిల్మ్ లతో కెరీర్ మొదలు పెట్టి, వెబ్ సిరీస్ లతో పాప్యులర్ అయిన అచ్చ తెలుగు అమ్మాయి వైష్ణవి చైతన్య... తొలి సినిమా 'బేబి'తో స్టార్ అయిపోయింది. ప్రస్తుతం హీరో సిద్ధూ జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటిస్తోంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ లో వైష్ణవి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ లో తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావు అనే ప్రచారం ఎందుకు జరిగిందో కానీ... ఆ ప్రచారం వల్లే చాలా మంది అమ్మాయిలు ఇండస్ట్రీకి రావాలనే ఆలోచన చేయడం లేదని వైష్ణవి చెప్పింది. ఇండస్ట్రీలోకి రావాలనే ప్రయత్నమే చేయకపోతే ఎలాగని ప్రశ్నించింది. ఓపికతో ప్రయత్నిస్తే అవకాశాలు వస్తాయని... దానికి తానే ఉదాహరణ అని చెప్పింది. అవకాశాలు రావు అని భయపడి ఆగిపోయే బదులు గట్టిగా ప్రయత్నిస్తే అవకాశాలు మీ తలుపు తడతాయని... ఇండస్ట్రీలోకి రావాలనుకునేవారికి ఇదే తానిచ్చే సలహా అని చెప్పారు.

## అషూకి బ్రెయిన్ ట్యూమర్...!



జూనియర్ సమంతగా పేరు తెచ్చుకున్న అషూ రెడ్డి బిగ్ బాస్ షోతో మంచి పాపులారిటీ తెచ్చుకుంది. మొదట్లో టిక్ టాక్ వీడియోలు, రీల్స్ చేసుకుంటూ వచ్చిన ఈ అమ్మడు ఛల్ మోహన్ రంగా సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఇందులో అషూ నటనకి ఇంప్రెస్ అయిన బిగ్ బాస్ నిర్వాహకులు ఆమెకి షోలో పాల్గొనే ఛాన్స్ ఇచ్చారు. బిగ్ బాస్ తర్వాత అషూ రేంజ్ పెరిగిపోయింది. అషురెడ్డి రెండు సార్లు బిగ్‌బాస్‌లో అడుగుపెట్టింది. కానీ ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయింది. చూడ్డానికి అచ్చం సమంత లాగే ఉండే ఆమెకు జూనియర్ సామ్ అనే బిరుదు రాగా, అది తనకు ఇష్టం లేదని చెప్పుకొచ్చింది. తనని అషురెడ్డిగానే ప్రేక్షకులు గుర్తించాలని కోరకుంటున్నట్లు తెలిపింది. అయితేఎంతో చలాకీగా సరదాగా ఉండే అషురెడ్డికి బ్రెయిన్ ట్యూమర్ వచ్చిందట. హెయిర్ తీసేసి సర్జరీ కూడా చేసినట్టు తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 2024లో కామాఖ్య టెంపుల్‌కి వెళ్లినప్పుడు తనకి విపరీతమైన తలనొప్పి వచ్చిందట. ఐదు రోజుల పాటు డోలో వేసుకున్నా కూడా నొప్పి తగ్గలేదు. తల అంతా బరువుగా ఉండేది. తల కూడా లేపలేని పరిస్థితి వస్తే.. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి టెస్టులుచేయించుకన్నాను. అప్పుడు బ్రెయిన్ లో టమాటా సైజ్ అంతా ట్యూమర్ ఉందట. అది చూసి డాక్టర్స్ షాక్ అయ్యారు. ఎలాంటి లక్షణాలు లేకుండా ట్యూమర్ ఉండటం అందరిని ఆశ్చర్యపరిచింది. అయితే అపోలో ఆసుపత్రిలో ఆపరేషన్‌కి రెడీ చేశారు. డబ్బులు ముందు ఏమి అడగకుండానే సర్జరీ చేశారు. ఆసుపత్రిలో 10 రోజులు ఉన్నాను. సర్జరీ టైమ్‌లో సగం జుట్టు తీసారు. అయితే ట్యూమర్ తీసేటప్పుడు నరాలు డిస్టర్బ్ అయితే మెమోరీ లాస్ అవ్వొచ్చు లేదంటే ఏదైన జరగొచ్చు అని ముందే నన్ను ప్రిపేర్ చేశారు. కాని ఆపరేషన్ బాగానే అయింది. గట్టిగా మాట్లాడలేకపోయాను. ఆరు నెలలు రెస్ట్ తీసుకోవాలని చెప్పారు కాని ఖాళీగా కూర్చోలేక రెండు నెలలకే షూట్‌కి వెళ్లాను. హెయిర్ స్టయిలిష్ట్స్ విగ్స్ తో సెట్ చేయడానికి ఎంతో కష్టపడ్డారు. పనిలో పడడం వల్లనే త్వరగా రికవరీ అయ్యాను అని అషూ పేర్కొంది. అయితే ఎంతో సరదా సరదాగా ఉండే అషూ ఇన్ని బాధలు పడిందా అని అందరు ఆశ్చర్యపోతున్నారు.

## రష్మిక- విజయ్ దేవరకొండల దాగుడుమూతలాట..!



గత కొద్ది రోజులుగా విజయ్ దేవరకొండ-రష్మికల రిలేషన్ షిప్ గురించి ఎన్నో వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. కాని దానికి వారు సరైన క్లారిటీ ఇవ్వడం లేదు. ఓ రకంగా దోబూచులాడుతున్నారు. ఫెస్టివల్స్ ని కలిసే సెలబ్రేట్ చేసుకుంటున్నారు. వెకేషన్స్‌కి కలిసే వెళుతున్నారు. ఇద్దరిలో ఎవరి బర్త్ డే అయిన కూడా ఏదో వెకేషన్‌కి వెళ్లి అక్కడే కలిసి చేసుకుంటున్నారు. అయితే ఏప్రిల్ 5న రష్మిక బర్త్ డే కాగా, ఆమె తన బర్త్ డే సెలబ్రేషన్స్ కోసం ఒమన్ వెళ్లారు. అక్కడ దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేయగానే%ొా% చాలా మంది 'విజయ్ దేవరకొండ ఎక్కడ?' అంటూ కామెంట్ చేశారు.అయితే విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు షేర్ చేయడంతో ఇద్దరు కలిసే ఉన్నారనే చర్చ మొదలైంది. విజయ్ దేవరకొండ అండ్ రష్మిక ఇద్దరు విడివిడిగా ఒమన్ వెళ్లినట్టు తెలుస్తుంది. రష్మిక కంటే ఒక్క రోజు ముందు ముంబై నుంచి విజయ్ దేవరకొండ ఒమన్‌కి బయలుదేరాడు. ఆ తర్వాత రోజు నేషనల్ క్రష్ రష్మిక వెళ్ళింది. ఇద్దరు ఒకే చోటకు వెళ్లారనే సంగతి ఆడియన్స్ అందరికీ అర్థమవుతుంది. మొదట రష్మిక మందన్నా పంచుకున్న ఫొటోలలో ఆమె సముద్రపు ఒడ్డున బోట్‌లో విందు ఆరగిస్తుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సముద్ర తీరంలో గుర్రపు స్వారీ చేస్తున్న ఫోటోలను, నడుస్తున్న ఫోటోలను విడుదల చేశారు. అవి చూసాక ఇద్దరు ఒకే చోట ఉన్నారని నెటిజన్స్ భావిస్తున్నారు. తమ ప్రేమ గురించి విజయ్ దేవరకొండ ఇలా క్లూ ఇచ్చాడని, వీలైనంత తొందరలోనే వారి రిలేషన్ షిప్‌కి సంబంధించి పూర్తి క్లారిటీ అయితే వస్తుందని నెటిజన్స్ అంటున్నారు. సినిమాల విషయానికి వస్తే%ొా% విజయ్ దేవరకొండ హీరోగా జెర్సీ మళ్ళీరావా సినిమాల ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబోలో 'కింగ్‌డమ్ చిత్రం రూపొందుతుంది. కొద్ది రోజుల క్రితం సినిమాకి సంబంధించిన టీజర్ విడుదల కాగా, ఇది సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ సారి విజయ్ దేవరకొండ ఎలాగైన పాన్ ఇండియా హిట్ కొట్టడం కన్ఫర్మ్ అని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక చివరిగా సికందర్ చిత్రంతో పలకరించిన రష్మిక ఇప్పుడు నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో 'ది గర్ల్ ఫ్రెండ్' చేస్తున్నారు.

## రాంచరణ్ పెద్ది గ్లింప్స్.. బాక్సాఫీస్ రికార్డులు బద్దలే..!




లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పెద్ది. 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఉత్తరాంధ్ర స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో, వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు తెరకెక్కిస్తున్నారు. కాగా ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. పెద్ది గ్లింప్స్‌తో రిలీజ్‌కు ముందే రికార్డుల వేట షురూ చేశాడు రాంచరణ్. విడుదలైన 24 గంటల్లోనే పెద్ది గ్లింప్స్ 36.5 మిలియన్లకు పైగా వ్యూస్‌తో టాక్సిక్ గ్లింప్స్ వ్యూస్‌ను అధిగమించి అదిరిపోయే ఫీట్ నమోదు చేసింది. ఈ ఒక్క అప్‌డేట్‌తో పెద్ది బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలుపెట్టినట్టు ఫిక్సయిపోతున్నారు అభిమానులు, మూవీ లవర్స్.

ఫస్ట్ షాట్ అంటూ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఒకటే పని చేయడానికి.. ఒకే లాగా బతకడానికి ఇంత పెద్ద బతుకెందుకు. ఏదేమైనా ఈ నెల మీద ఉన్నప్పుడే చేసేయాలి. పుడతామా ఏంటి మళ్లీ అని రామ్ చరణ్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ మూవీలో రామ్ చరణ్ గల్లీ క్రికెటర్‌గా కనిపించ బోతున్నట్టు గ్లింప్స్ తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ పాన్‌ఇండియా చిత్రంలో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తుండగా.. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందించబోతున్నాడు. బాలీవుడ్ నటుడు 'మీర్జాపూర్' వెబ్ సిరీస్ ఫేం దివ్యేందు శర్మ విలన్‌గా నటిస్తున్నాడు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No.10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI No. TELTEL/2015/62524 Cell : 9966443465